(సంపుటి - I)



# హరినే అడుగరో ఆమాట

ఇది

ఎన్నుకొన్న అన్నమయ్య కీర్తనలకు

భావ దర్పణము





శ్రీరస్తు

శుభమస్తు　　　　అవిఘ్నమస్తు





# హరినే అడుగరో ఆమాట

(సంపుటి - I)

## ఎన్నుకొన్న అన్నమయ్య కీర్తనలకు

# భావదర్పణము


రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

M.Tech.

# హరినే అడుగరో ఆమాట

(సంపుటి - I)

మొదటి ప్రచురణ

**అక్టోబర్ 2014**

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

వెల : **అమూల్యం**

**ప్రతులకు :**

**ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,**

**హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360**

**డి.టి.పి. ప్రింటింగ్ :**

**కె.వి.ఆర్.**

**98495 79345**





## అంకితము



కం॥ పరమాత్ముడొక్కడేనని
శరణంటే చాలు మనని సంరక్షించున్
వరదుడు అతడే, తెలిసెను
సరి అంకితమిత్తుదీని సర్వేశ్వరుకున్

**తా.**॥ మనల్ని పుట్టించి, రక్షించి, శిక్షించి చివరకు భక్షించేది కూడా పరమాత్మయే. పేరేదైనా ఆడ అయినా మగయైనా, జాతి మతము యేదైనా పరమాత్మ ఒక్కడే. మంచి ఆలోచన, మంచిమాట, మంచి నడవడి ఇవే ఆయన మననుంచి కోరుకునేది. "డబ్బు" కావలసింది మనకి ఆ సర్వేశ్వరునకు కాదు. ఆ పరమాత్మకే దీనిని అంకితమిస్తున్నాను.

# హరినే అడుగరో ఆమాట

**(సంపుటి - I)**

**ఎన్నుకొన్న అన్నమయ్య సంకీర్తనలకు భావదర్పణము**

## విషయ సూచిక


| క్ర.సం. | కీర్తన వివరము | సంపుటము/సంఖ్య | పేజి |
|---|---|---|---|
| 1. | ఆంజనేయ అనిలజ హనుమంత | IV/458 | 7 |
| 2. | ఆచార విచారాలవియు | IV/395 | 25 |
| 3. | ఆతడే బ్రహ్మణ్య దైవము | III/358 | 32 |
| 4. | ఇంతలోనే యెచ్చరేది ఇంతలో మోసపోయేది | III/349 | 41 |
| 5. | ఇందుకుగా నా యెరగమి | IV/371 | 2 |
| 6. | ఇట్టిదివో హరికృప యెంచినను | IV/372 | 8 |
| 7. | ఇన్నిటా శ్రీహరి భక్తియిది | III/425 | 31 |
| 8. | ఇన్నివిధాలు యికనేల | IV/323 | 13 |
| 9. | ఇప్పుడు నమ్మినవారి | XV/265(పె.అ) | 51 |
| 10. | ఎన్నికై శ్రీవేంకటేశుడితడు | III/262 | 30 |
| 11. | ఎన్ని చందముల నెట్టైనా | III/427 | 29 |
| 12. | ఎప్పుడేబుద్ధి పుట్టునో | IV/383 | 12 |
| 13. | ఏదైనా దేవుడు ప్రాణికియ్యక | IV/377 | 11 |
| 14. | ఏమని చెప్పెదనిటుమీద హరీ | IV/394 | 24 |
| 15. | ఒకరి బుద్ధులు వేఱొకరి పనికిరావు | IV/390 | 22 |
| 16. | ఒక్కదెవ్వడో వుర్వికి దైవము | III/333 | 38 |
| 17. | ఒలపక్షము లేనొక్కదైవము | IV/392 | 18 |
| 18. | కలగాలమునిట్టే కాపురపు బదలికాయ | IV/361 | 3 |
| 19. | కలదాయింతటి దాత కమలనాభుడే | IV/255 | 6 |
| 20. | కాదు వివేకము యిది కాదు యవివేకము | XV/264(పె.అ) | 48 |
| 21. | కోరినీయీవికిదొడ్డ గొంచెము లేదు | XV/264(పె.అ) | 49 |
| 22. | గోవిందా నేనిట్టివాడ | XV/171(పె.అ) | 45 |
| 23. | చెప్పగా నెఱగరా చేరి వేదవ్యాసులు | III/351 | 40 |
| 24. | జపియించరె సర్వజనులు | XV/43(పె.అ) | 46 |
| 25. | జీవుడ నేనొకడను సృష్టికి కర్తవునీవు | III/275 | 39 |
| 26. | తెగగోయుటకు హరి దివ్యనామము | IV/268 | 27 |
| 27. | దైవమే నేరుచుగాక తగిలించ | IV/359 | 10 |
| 28. | నడపేవేటికి నాటకము | III/289 | 28 |
| 29. | నమ్మినదిదివో నాపితరార్జిత | IV/385 | 16 |
| 30. | నారాయణుడే సర్వనాయకుడు | III/264 | 35 |
| 31. | నీచమైన నావల్లనెరవై | IV/417 | 17 |
| 32. | నేనవగుణినైన నీకు బోదు | IV/367 | 9 |
| 33. | నేనైవిడువవద్దు తానై తగులవద్దు | IV/414 | 21 |
| 34. | నేమెంత మూఢులమైనా | III/423 | 33 |
| 35. | పనిలేదేమియు నాకు | IV/398 | 26 |
| 36. | పరిపూర్ణుడవు నీకు | XV/279(పె.అ) | 50 |
| 37. | పురుషోత్తమ నీవే బుద్ధిచ్చి | XV/37 (పె.అ) | 44 |
| 38. | బల్లిదులు నీకంటె బరులు | IV/360 | 5 |
| 39. | మానదు మతిమరపును | IV/362 | 4 |
| 40. | ముట్టితేనే మాయై బట్టితేనే | IV/382 | 14 |
| 41. | విన్నపమిదె నీకు వేవేల | IV/422 | 20 |
| 42. | విష్ణుడ వచ్యుతుడవు విశ్వపరిపూర్ణుడవు | III/413 | 34 |
| 43. | వెఱవకు మనసా విష్ణుని యభయము | III/276 | 36 |
| 44. | వైకుంఠపతివడి నిన్ను | XV/223 (పె.అ) | 42 |
| 45. | శరణు శరణు నీకు సర్వేశ్వరా | XV/218 (పె.అ) | 43 |
| 46. | శిష్ట రక్షణమును దుష్ట నిగ్రహము | III/258 | 23 |
| 47. | శ్రీపతియే రక్షించుగాక | XV/138(పె.అ) | 47 |
| 48. | సందడి సొమ్ములతో డిసాకారమిదె | IV/386 | 15 |
| 49. | సేయరాని చేతలెల్లా జేసితి | IV/311 | 37 |
| 50. | హరినీకేనే రుణమత్తుగాక | IV/421 | 19 |
| 51. | హరినేయడుగరో ఆమాట | IV/254 | 1 |




హరినే అడుగరో ఆమాట

# ప్రార్థన

కం॥ శ్రీవరుని నమ్మి కొలువుదు
నీవారగు హరికి ప్రియులు నీకే ఆపై
కైవల్యము నిప్పించగ
ఆ విష్ణున్ "హరినె అడుగుడామాటనరో"

ఉ॥ శక్తిని నమ్మితిన్ తొలుత శౌరిని గానక పెచ్చుమీరితిన్
రక్తికి ప్రాకులాడితిని లబ్ధికి రూకకు లొంగిపోతిరో
యుక్తికి యుర్విలొంగుననియోగ్యత సంపదగా తలంచితిన్
ముక్తియొసంగు వేంకటపు మూర్తికృపన్ తనబాట పట్టితిన్.

ఆ.వె॥ వెతికి అర్థమెఱుగ విపులీకరించంగ
కొన్ని పదములంటు కొనుటగాక
చేతులెత్తి మొక్కి శ్రీవేంకటేశంటి
స్ఫురణకందుచుండె చోద్యముగను.

చం॥ సరసిజనాభుపాదములు సారసభవ్వుడు కడ్గపావనై,
పరమశివుండుదూకమున పర్వులు వెట్టుచు దూకి కొప్పులో
బిరబిర జిక్కి వానిదయ వెల్వడి భూమిని జేరె గంగయై
నరులది జన్మయా శివ, జనార్దన, బ్రహ్మల నీట దద్వకన్.

కం॥ ఇతనికి సాటిని వెతకిన
ఇతడేయని తెలియునయ్య! ఇలకున్, సిరికిన్
ఇతనిని పతిగా కొలుతురు
ఇతడే భువనాల భర్త ఏలిక మాకున్.

సీ॥ హరికృప యెట్టిదో అరయువాడెవ్వండు?
వివరించగలిగిన వేత్తయెవడు?
కుంటిని నడిపించు, గుడ్డికి గనులిచ్చు
అవిటిచే వ్రాయించు నెవడెరుంగు?
కూలిదానినికూడ యేలిక సేయును
సిరులున్న చినదాని పరువుదీయు,
భక్తుడైగుడికట్టు వానిని చెఱబెట్టు
నమ్మని వానికి నయము గూర్చు





ఆ.వె॥ చెప్పలేము వాని చేతలు నిజమిదే
శరణు కోరు వానికరుణబ్రోచు
వేంకటేశ! వలదు వేరెవ్వరనువాని
గరుడగమను దెపుడు కాయుచుండు.

తే.గీ॥ నిలువదాయె యీ చిత్తంబు నిమిషమైన
వేద శాస్త్ర జ్ఞానములేదు మదముపోదు
శరణు అనలేను వైరాగ్యమరయబోను
నన్ను యేతీరుబ్రోతువో నళిననాభ!

మత్తకోకిల :
మంచిదో మరి చెడ్డదో "ఇది" మాకు వద్దనకాదురా
యెంచి యిచ్చిన జన్మపుచ్చుక "ఇంగితంబును" వీడకన్
అంచెలంచల దైవభక్తిని ఆ హరీ శరణాగతిన్
నించి జన్మము పూర్తిజేసిన నీకు "మోక్షము" దక్కురా!

శా॥ శ్రీనాథా! ననుగావవే శరణునే చేకొంటిరా నా మనం
బేనాడో నిను ఆశ్రయించి కొలిచెన్ యేనెంచెదన్ సర్వమున్
ఆ నా సప్తగిరీంద్రుడే, అతనికే అర్పింతు జీవంబులన్
నానాపాపములెంచబోకు మిక వోనా దైవమా బ్రోవుమా.

చం॥ మనమున నిల్పెదన్ హరిని మానక కీర్తన నొక్కదానికిన్
దినమున అన్నమయ్యకృతి దీటుగ జెప్పెద భావమంతయున్
కనులకు దర్పణంబరయగా నిలబెట్టినయట్లు మిత్రమా!
మన తిరువేంకటేశ్వరుని మన్నన పొందును శంకయేటికిన్?

మ॥ అదినా భాగ్యము అన్నమయ్య కృతులన్ అందించితిన్ ఇత్తరిన్
పదముల్ సంఖ్యకు రెండువేలు గడచెన్ బంగారు తావబ్బెనో
మదిలోనిల్చిన ఏడుకొండలదొరన్ మాదైవమున్ గొల్చెదన్
ఇదిగోనిద్దియు వానిమెప్పుగొని నా ఇష్టంబు నీడేర్చుగా.

# ముందుమాట

శ్రీవేంకటేశ్వరుని లీలలను వివరించగల సమర్థత నాకులేకపోయినా, నా జీవితంలో నేను స్వానుభవంగా నేర్చిన సత్యాన్ని చాటిచెప్పగల ధైర్యం అర్హతా రెండూ నాకున్నాయి. 2002వ సంవత్సరం జూన్ 16న నేను జీవన్మృతుడనయ్యాను. పక్షవాత వ్యాధిపీడితుడనై కంటిచూపు చెడిపోయి డబల్ విజన్ వచ్చింది. కుడిచెయ్యి కుడికాలు, ఐదవవంతు శక్తితో మేము "పడిపోలేదు" సంతోషించు అన్నట్లు మిగిలాయి. నోరు మూతపడదు. సిగరెట్ తాగే అవకాశం లేదు కాని మాట ఉచ్చారణ స్పష్టంగానే మిగిలింది.

కుడిచేతితో అన్నంతినలేనివాడు, కలం పట్టుకొని ఒక్క అక్షరం వ్రాయలేనివాడు కుక్కతరిమినా పారిపోలేనివాడు బ్రతికి ఉపయోగమేముంది?

శ్రీనివాసుని నేను మనస్ఫూర్తిగా "చావు" కోరని క్షణం లేదు. ఆయన ప్రత్యేకత, ఆయనా నిలుపుకొన్నాడు. ఏమిటది? నీవు కావాలన్నది చేయడు. నీవు కాకూడదన్నది చేస్తాడు అదీ తనిష్టంవచ్చినట్లు చేస్తాడు. సరే! మరి నాగతేమిటి? ఎడమచేత్తోనే తినాలా? జీవితాంతం డబల్ విజన్‌తో చదువుకోలేక వ్రాయలేక బ్రతకాలా? దేనికోసం? నా కోరిక 'ఆయన' తీర్చడని ఆరునెలల్లో అర్థమయింది. ఈకాలంలో నేను చేసిన మంచిపని ఒకటుంది. అది నాబోటి నిర్భాగ్యులకు వుపయోగపడుతుంది. అందుకే 'సోది' అంతా వ్రాస్తున్నాను.

నేను చేసిన మంచి పనేమిటంటే, నా దౌర్భాగ్యానికి యేడ్చానేగాని ఏనాడూ దేవుని నిందించలేదు. త్రికరణశుద్ధిగా ఆయన నా కర్మఫలం నాకిచ్చాడని నమ్మాను. అదే నేను చేసిన మంచిపని. ఆయన నా పశ్చాత్తాపాన్ని మన్నించాడు. ఇంగ్లీషు చదవలేను కాని తెలుగు చదవగలను ఒకప్పుడు తెలుగులో పద్యకవిత చెప్పగల సమర్థత యెక్కడికీ పోలేదు. నా M.Tech. చదువు కురుక్షేత్రంలో కర్ణుని "అస్త్ర"విద్యలా నిరుపయోగం అయింది. కాబట్టి టీచింగ్‌కి పనికిరాను. సోల్డరింగ్ ఐరన్ పట్టుకోలేనివాడు ఇంకేం పనిచేయగలడు? అంతే విరక్తి కలిగి





నా గత జీవితంలోని వారందరినీ త్యజించాను. ఏడుకొండలవాడినే సూటిగా ప్రశ్నించాను. స్వామీ! నీవే గెలిచావు నేను ఓడిపోయాను. కాని నన్నే ఆశతో జీవించమన్నావో చెప్పు. నాగతేమిటి?

అది నేను చేసిన రెండవ మంచిపని. ఆయన నాకు స్ఫురణ కలిగించాడు. ఎలాగైతే ఎడమ చేత్తో స్పూన్‌తో తినటం నేర్చుకొన్నావో యెడమచేతో వ్రాయలేవా? ప్రయత్నించు. మళ్ళీ ఆయన ఆజ్ఞ శిరసావహించాను. రెండు నెలల కృషితో యెడమచేతితో వ్రాయగలిగాను. ఇక నేను వెనుదిరిగి జూడలేదు.

ఆ దేవదేవుడు ఈ జీవికి ధనం గురించిన చింత ఇవ్వలేదు. ఆదిశంకరుల శివానందలహరి వంటి కావ్యాలను తెలుగు పద్య తాత్పర్యాలలో చెప్పాను. తిరుప్పావైని తెలుగు పద్యతాత్పర్య కావ్యంగా చెప్పి శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నశ్రీమన్నారాయణ రామానుజ జీయరుస్వామి వారిని మెప్పించాను. అయ్యప్ప చరిత్ర కూడా చెప్పి అనేక "స్వాముల" మెప్పు పొందాను. సాయిబాబా జీవిత చరిత్ర ఏడు రోజుల పారాయణ కావ్యంగా ద్విపదలో చెప్పాను. గురుచరిత్ర చెప్పాను. చివరికి నా స్వంత "Website" www.geetadeeksha.com పేరుతో ఓపెన్ చేసి పద్యాలలో చెప్పిన భగవద్గీతనుంచి, శ్రీనారాయణ భట్టుతిరి సంస్కృతంలో చెప్పిన శ్రీమన్నారాయణీయం దశమ స్కందం వరకు తెలుగు పద్యతాత్పర్యాలలో అనువదించాను.

దీనికి శ్రీవేంకటేశ్వరుడు తృప్తిచెంది నా జీవిత పరమార్థం నామిత్రులొకరి ద్వారా నాకు తెలియజేశాడు. అదే అన్నమాచార్యులవారి కీర్తనలకు ఉపోద్ఘాత సహితముగా తాత్పర్యాన్ని వివరించడం. నేటివరకు 2025 కీర్తనలు పూర్తిచేశాను. ఇందులో మొదటి 1010 సాక్షాత్తు టి.టి.డి. అన్నమాచార్య ప్రాజెక్ట్ వారే స్వీకరించి నా జీవితం చరితార్థం చేశారు.

భావసామీప్యంగల పలువురు అన్నమయ్య ప్రియులను తృప్తిపరచగలిగాను. ఆ వివరములతో విసిగించి నేను చెప్పదలచిన నా మనోగతాన్ని భ్రష్టుపట్టించుకోను. సృష్టిలో జీవులు కర్మబద్ధులు. భగవంతుడు దీనరక్షకుడే

కాని, ఎవరి కర్మఫలాన్ని వారు అనుభవించక తప్పదు. ఎన్ని జన్మలు పొందినా తీరని కర్మఫలం అనుభవిస్తూనే వుంటాము. అందుకనే మంచికి చెడు, చెడ్డవారికీ మంచి జరుగుతున్నదేమో అనే భ్రమ కలిగి జీవుల్ని భ్రష్టులను చేస్తుంటుంది. ఆయన సాక్షి. ఎవరి మీద రాగద్వేషాలు లేనియోగేశ్వరుడు.

కాబట్టి మన లోపాలకు ఆయన్ని బాధ్యుడిని చేయకండి. అన్నమయ్య కృతులకు నాబోటి అనామకుడు వివరించగలడా? అది ఆయన ఇచ్చిన అనుగ్రహం. కానీ నా తపన, కృషి లేకుండా స్వామీ అంతా నీదే బాధ్యత అంటే ఆయన "పోరాపో" అంటాడు. కాని స్వామి నేను వ్రాస్తాను, నాలో చైతన్యమూర్తివై వ్రాయించు అంటేనే వ్రాయిస్తాడు. అది నేను స్వానుభవంగా నేర్చిన సత్యం. వాళ్ళ కాలిగోటికి తూగనినన్ను, అనేక గొప్ప వ్యక్తులతో అనుసంధానపరచి నాకింత గొప్ప సాఫల్యతనందించాడు ఆ తిరుమలయ్య.

ఇపుడు మీ చేతిలోవున్న ఈ "హరినే అడుగరో ఆమాట" లో అన్నమయ్య భక్తి వైరాగ్య శృంగారకీర్తనలను ఉపోద్ఘాత రహితంగా భావమును దర్పణంలో చూపినట్లు వివరించాలని ప్రయత్నించాను. ఇవన్నీ దాదాపుగా అనాఘ్రాత పుష్పాలు. పండితులు కించిత్ దోషమును ఈ దర్పణంలో పొడగనినా సహృదయంతో మన్నిస్తారని ఆశిస్తాను. నిష్ణాతులే అన్నమయ్య అసలు భావం కనిపెట్టలేక కళ్ళు తేలవేసే సందర్భాలను ఈ సాహిత్యంతో పరిచయమున్న వారెరుగుదురు. ఇక నేనెంత చెప్పండి.

అయినా మానవప్రయత్నం తప్పక చేయాలి ప్రయత్నించేవాడు గట్టెక్కటమో లేక పరాజయంతో ప్రాణాలు కోల్పోవటమో జరుగుతుంది. ప్రయత్నించనివాడు గట్టెక్కే ప్రసక్తేలేదు. నాకు రెండూ ఇష్టమే. అందుకనే నేను తాబేలు మెల్లిమెల్లిగా పొగరుబోతు కుందులుని జయించినట్లు నాలోని "నిస్సత్తువ" అనే కుందేలుని ఓడించి శ్రీవేంకటేశ్వరుని కృపకు పాత్రుడనైనాను.

ఇది శ్రీహరి సంకల్పమా అన్నట్లు నేను యధాలాపంగా యెన్నుకొన్న కీర్తనలు కూడా ఆణిముత్యాలవంటివి దొరికాయి. ఇవన్నీ (దాదాపు నూటికి తొంబది





ఐదు) అనాఘ్రాతపుష్పాలు. ఔత్సాహిక సంగీత నిష్ణాతులు వీటికి చక్కటి రాగాలు "కట్టి" జనబాహుళ్యంలో ప్రచారానికి తెచ్చి అన్నమాచార్యులవారి దివ్యాశీస్సులు పొందెదరు గాక. నేనిచ్చిన వివరణ చదివిన ఔత్సాహిక విద్వాంసులు భావానికి తగిన రాగం యెన్నుకొంటారని నా ఆకాంక్ష.

ప్రపంచంలో యెవరైన ఈ ప్రయత్నం చేయవచ్చును. ఆస్ట్రేలియాలోవున్న ఒక తెలుగు సోదరి యేఒక్కకీర్తననైనా "భావదర్పణ" వివరణ నచ్చి చక్కటి రాగంలో పాడగలిగితే అది అన్నమయ్య సేవ, శ్రీవేంకటేశ్వరుని పూజ, నాకు తృప్తి. నా జీవితాశయం సిద్ధించినట్లే.

నా ఇతర రచనలు "ఉద్ధవగీత", కబీర్‌దాసు దోహాలు, ఆదిశంకరాచార్యుల "ఆత్మబోధ" (ఆంగ్లంలో) వంటివి మీకు నచ్చుతాయని నా నమ్మకం. GOOGLE NETWORK విజిట్ చేస్తే "geetadeeksha.com" లో నా ఇతర రచనలలు మీరు చదవవచ్చు. 2025 అన్నమయ్య కీర్తనలు విశ్లేషణతో సహా చదవవచ్చు. దాదాపు 1800 కీర్తనలు వినవచ్చునుకూడా.









సంఖ్య : IV/254 రాగం : పళవంజరం పుట: 170

**1 హరినే యడుగరో ఆమాఁట**
**సరుగ నిందరికి సర్వేశ్వరుఁడు** ॥పల్లవి॥

**కామముఁ గ్రోధము కాయపు గుణములు**
**నేమపుతాత్మకు నిందేది**
**గామిడి మాయే కర్త యిందుకును**
**సోమరి మమ్మంటఁ జోటేది** ॥హరి॥

**పాపముఁ బుణ్యము భావవికారము**
**పైపై నాత్మకుఁ బనిలేదు**
**శ్రీపతి పంపిటు సేసితి మింతే**
**తాపి మమ్ముఁ దగులఁ దగవేది** ॥హరి॥

**కాయముఁ బ్రాయము కర్మపు గుణములు**
**సేయని యాత్మకు సెలవేది**
**యేయెడ శ్రీవేంకటేశునాజ్ఞలివి**
**చాయల నితనికి శరణంటిమి** ॥హరి॥**254**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ అధ్యాత్మ కీర్తనలో మానవశరీరం దాల్చుటవలన కామ, క్రోధాదులవంటి గుణములబ్బాయి. ఆ గుణాలవలన పాప పుణ్యాలు చేస్తున్నాము. ప్రాయంలో వుండే కాయమువలన ఆకర్మలు చేయాలనే గుణాలూ కలుగుతున్నాయి. వీటన్నిటికీ ఆత్మతో నిమిత్తమేముంది? అంతగా కావాలంటే వీటన్నిటి కారణభూతుడైన ఆ సర్వేశ్వరుడు శ్రీహరిని ఆమాట అడుగరో! అంటున్నారు. నిజమే కదా! ప్రతిదానికి ఆ దేవదేవుణ్ణే నిందిస్తే యేమి లాభము. కామము, క్రోధము దేహానికి సహజమైన లక్షణాలు. నియమంతో వుండే ఆత్మకు నిందయెట్లా వుంటుంది? ఈ కామక్రోధాది గుణములకు గామిడి మాయే (శ్రేష్ఠమైన మాయయే) కర్త. మేము సోమరులం కదా! ఇంకా మమ్మల్ని నిందించుట దేనికి? పాపకర్మలు, పుణ్యకర్మలు మనసున కలిగిన భావ వికారమువల్ల చేయబడుతవి కదా! పైపైనే సంచరించే ఆత్మకు ఈ పాపపుణ్యాలతో నిమిత్తమేమిటి? మమ్మల్ని శ్రీపతి యేమేమి పనులు చేయరా అని భూమిపై పంపాడో మేము అవే చేశాము. ఇట్లా మమ్మల్ని తగులుకోటానికి మాతో మీకేమి తగవు? కాయమువల్లనో ప్రాయమువల్లనో కర్మమువల్లనో అబ్బిన గుణములకు యేనిమిత్తము లేని ఆత్మవలన ఉపాయమేమి? ఇవన్నీ శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞలు. మేము నిశ్చింతగా ఆయనకు శరణంటిమి. ఇక మాకేమి భయము?

★ **సరుగు** – వర్ధిల్లు ★ **గామిడి** – శ్రేష్ఠమైన ★ **సెలవు** – ఉపయోగము





సంఖ్య : IV/371 రాగం : మాళవశ్రీ పుట: 249

**2 ఇందుకుఁగా నాయెరఁగమి నేమని దూరుదును**
**అందియు నిను నేఁదెలియక అయ్యో నేనిపుడు** ॥పల్లవి॥

**ఆతుమలోననుండి యఖిలోపాయములు**
**చేతనునకు నీవే చింతించఁగాను**
**కాతురపడి నేను కర్తననుచుఁ బనులు**
**యీతలఁ జెప్పఁగఁబూనే నిస్సిరో** ॥ఇందు॥

**తను విటు నీవొసఁగి తగుభాగ్యము నీవై**
**అనువుగ జీవుని నీయటు నీవేలఁగను**
**తనియక నే వొరులు దాతలనుచుఁ బోయి**
**కనుఁగొని వేడఁగఁ దొడఁగేఁ గటకటా** ॥ఇందు॥

**శ్రీవేంకటాద్రిపై నుండి చేరి కన్ను లెదుటను**
**సేవగొని యిట్టే కృపసేయఁగాను**
**సోవలఁ గన్నవారెల్లాఁ జుట్టములంటా నేను**
**జీవులతోఁ బొందుసేసేఁ జెల్లఁబో** ॥ఇందు॥**371**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ అధ్యాత్మకీర్తనలో యేమంటున్నారో విని ఆశ్చర్యపోకండి. వైరాగ్యంలో తనిసిన వారికి అది సహజమే. ఇందుకు కారణం నాయెరుగమి (అజ్ఞానం). పరులను యేమని నిందించగలను? అయ్యో! నీవు కృపతో నాకందుబాటులో వున్నా నిన్ను నే తెలుసుకోలేకపోయాను. ఎంత దౌర్భాగ్యుడిని? స్వామీ! ఆలోచిస్తే నీవెక్కడున్నావు? మా ఆత్మలోవున్నావు. సామ, దాన బేధ దండోపాయములలో యేదో ఒకదానిని సమయానుకూలంగా యెన్ని, నాలో చేతనునిగా వున్న అంతర్యామివి నీకే ఆలోచించుటకు ఆదేశిస్తున్నాను. ఈలోగా తొందరపడి నేనే కర్తనని భ్రమిస్తూ, ఇక్కడ అందరికీ జెప్పుకొంటుంటాను. ఇస్సిరో (అయ్యయ్యో!) ఆలోచిస్తే, నాకు శరీరం ఇచ్చింది నీవు. నాకున్న భాగ్యమునిచ్చింది నీవు. జీవుని రూపంలో నాలోవుండి సర్వమూ నీవే నియంత్రిస్తున్నావు. కటకటా! (హతవిధీ) నేనేం చేస్తున్నాను? నాకివన్నీ యెవడో దొర ఇచ్చాడని వాడిని తృప్తితీరక కీర్తిస్తున్నాను. వాడి దగ్గరకు వెళ్ళి ఇంకా ఇంకా ముష్టెత్తుతున్నాను. ఛీఛీ యెంత దౌర్భాగ్యుడను? శ్రీవేంకటాద్రిపైనుండి దిగివచ్చి, మా కన్నులయెదుట నిలిచి, మా సేవగొని ఇట్టే దయజూపుచుంటివి. కాని నేను కనబడ్డ అందమైన వాళ్ళంతా నా ఆత్మీయులనే భ్రమలో వాళ్ళని నాచుట్టాలంటూ తిరుగుతుంటాను. నాతోటి జీవులతో పొందుకు ఆరాటపడతాను. అయ్యయ్యో!

★ **సోవల** – అందమైన ★ **కాతరపడి** – అధీరతతో తొందరపడి
★ **పొందుసేసే** – స్నేహము చేస్తాను.

సంఖ్య : IV/361    రాగం : పాడి    పుట: 242

**3 కలకాలము నిట్టేకాఁపురపు బదుకాయ**
**యిలదైవమా నాకెన్నఁడో నిశ్చయము ॥పల్లవి॥**

**గుట్టుతో వైరాగ్యమే కోరుదు నే నొకవేళ**
**అట్టున సంసారపుటాఅడి గోరుదు**
**ముట్టుపడి యొకచోట మ(న) సెందు నిలువదు**
**యిట్టె చెంచెలుఁడ నాకు నెన్నఁడో నిశ్చయము ॥కలకాల॥**

**కొంతవడి నే సత్త్వగుణమందు నెలకొందు**
**అంతలో రాజసగుణినై యుందును**
**చెంత దామసగుణము చేకొందు నొకవేళ**
**యింత పలువంచలు నా కెన్నఁడో నిశ్చవయము. ॥కలకాల॥**

**వివరించి యొకవేళ వివేకివలె నుందు**
**ఆవల మూఢుఁడనవుదు నంతటిలోనే**
**తవిలి శ్రీవేంకటేశ తగ నిన్ను దలఁచంగ**
**యవల దొల్తేయాయ (?) నెన్నఁడో నిశ్చయము ॥కలకాల॥361**

**భావ దర్పణము :**

అన్నమయ్య వైరాగ్య కీర్తనల నాకళింపు చేసికొంటే, యెంత విముఖత ఈ సంసారంపై ఆయన అనుభవించారా అనిపించకమానదు. ఏమిటీ బ్రతుకు? దీన్ని చూడబోతే “కలకాలం జీవించరా” అని ఆదేశించిపంపాడా యేమిటి నన్ను ఆ దేవుడు అని నాకు నిశ్చయమవుతున్నది. ఇదేమివింత? ఒక్కొక్కసారి రహస్యంగా వైరాగ్యమే మంచిది అనుకొంటుంటాను. దాన్నే కోరుకుంటాను. సంసారం ఆరడితో కూడినదని తెలిసినా బాహాటంగా దాన్నే కోరుకుంటాను. ఒంటరిగా వుండాలని ఈ మనసు ఆకాంక్షించదు. ఎంతో చెంచలత్వము కలవాడను. నాకు “విముక్తి” యెప్పుడు నిశ్చయమైనదో? ఒకే బ్రతుకులో కొంతసేపు సత్త్వగుణంతో వుంటాను. మరొకప్పుడు రజోగుణముతో కామ్యకర్మలను ఆచరిస్తుంటాను. మరొకప్పుడు తామసగుణంతో వర్ధిల్లుతూ దానికి దగ్గరయై యుంటాను. ఏవేళ యేది వెలువడుతుందో యెన్నడు నిశ్చయించారు? నేనే ఒక్కొక్క వేళ వివరించుకొని వివేకిలా ప్రవర్తిస్తుంటాను. అంతటిలోనే మూర్ఖత్వం ఆవహించి వివేక శూన్యునిలాగా ప్రవర్తిస్తుంటాను. ఓశ్రీవేంకటేశా! నాకెందుకయ్యా? యీతిప్పలు. నిన్నుమనసులో తలచుకొంటే చాలదా? నాకేమి జరుగనున్నదో నాజన్మకుముందే నిశ్చయించేశావు కదా!

★ **అట్టున** – బాహాటంగా ★ **తొల్తేయాయ** – జన్మకుపూర్వావస్థ
★ **కొంతవడి** – చిన్నబోయి





సంఖ్య : IV/362    రాగం : బౌళి    పుట: 243

**4 మానదు మతిమఱపునుఁ దెలివియు**
**యేనింక దైవమ యేమిసేయుదును ॥పల్లవి॥**

**సకలపురాణాలు శాస్త్రాలు విని విని**
**వొకవేళ సుజ్ఞానమొదవును**
**వికటమై యంతలో విషయసుఖము గని**
**అకట కమ్మర బుద్ధి నవే కతలు ॥మానదు॥**

**పలుదుఃఖములబాధఁబడువారిఁ బొడగని**
**పలికి సంసారముపై రోసును**
**నలవంక సిరులలో నటియించువారిఁ జూచి**
**తలఁచి యాసలవెంటాఁ దగులునంతటను. ॥మానదు॥**

**యెడప కలమేల్మంగ యీరీతి నిన్నునే**
**బడిబడి యలసి తిట్టె పైపై నింక**
**చిడుముడి నీమీఁద శ్రీవేంకటేశ్వర**
**తడవియిట్ల దయదలఁచకుండినను ॥మానదు॥362**

**భావ దర్పణము :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో భావము ఒకింత తమాషాగావుందనే చెప్పాలి. మనిషికి యెంత తెలివియున్నా మతిమఱపూ సహజ లక్షణమే. ఈ బుద్ధి ఆ అవలక్షణం మానుకోవటం లేదు. ఓ దైవమా యేనింక (నేనింక) యేమిసేయుదునయ్యా? నాకేమి పాలుపోవటము లేదు. స్వామీ! ఇక నా పరిస్థితిని నీకెలా వివరించమంటావు? నేను పురాణాలు శాస్త్రాలూ చదివాను, విన్నాను. అందువల్ల ఒక్కొక్కప్పుడు తత్త్వజ్ఞానంతో విలసిల్లుతుంటాను. కాని అంతలోనే బుద్ధి వికటించి, విషయ సుఖాలవైపు మరలుతుంటుంది. అయ్యో! ఆపై నా బుద్ధిని విషయ సుఖాలు కథలు చెప్పి ఆడిస్తుంది. నా చుట్టూ అనేక రకములైన దుఃఖములను అనుభవిస్తున్నవారిని జూచి కలతచెంది ఈ సంసారమంటే రోత కలుగుతుంటుంది. కాని అదెంతోసేపు నిలువదు. నా చుట్టూ సిరిసంపదలతో పరవశించి గడుపుతున్నవారిని చూచి, వాటినే తలచుకొని నేనూ ఆసలవెంట పరుగులు పెడుతున్నాను. ఎన్నడూ దేవి అలమేల్మంగను విడిపోని నీవు కాస్త రోషపడాలని వుత్తుత్తిగా పైపైనే తిట్టానయ్యా! అంతే స్వామీ! కొద్దిగా చిడుముడి (కోపము) నీపై చూపించాను. ఓ శ్రీవేంకటేశ్వరా! తండ్రిపై పిల్లలు అలుగరా? నీవు నన్ను దయతలచట్లేదని నేనూ అలిగాను.

★ **వికటమై** – వంకరబుద్ధియై ★ **తడవి** – ఆలస్యంచేసి
★ **ఎడపక** – విడువక ★ **కతలు** – కథలు

సంఖ్య : IV/360 రాగం : లలిత పుట: 242

**5 బల్లిదులు నీకంటెఁ బరులున్నారా నన్నుఁ**
**దొల్లిటిబారి నింకఁ దోయకు మోయయ్య** ॥పల్లవి॥

**చిక్కుల భవములఁ జెరఁజిక్కి వోపలేక**
**నిక్కి నీమరఁగు చొచ్చి నిలిచితిని**
**అక్కజమై యల్లనాఁడే అప్పులకర్మములెట్ల**
**ఇక్కడనె చుట్టుముట్టీ నేమిసేతునయ్యా** ॥బల్లిదు॥

**లచ్చి సంసారమునకు లగ్గమచ్చి తీరలేక**
**యిచ్చట నిన్నుఁగొలిచి యెక్కువై తిని**
**పొచ్చముల నల్లనాఁటిపూఁట దీరదని కొన్ని**
**బచ్చనబంధాలు వచ్చెఁ బాఁపగదవయ్య** ॥బల్లిదు॥

**అంచల నింద్రియముల కరివెట్టి పెట్టలేక**
**ముంచి నీపాదాలకు మొరవెట్టితి**
**పొంచిన శ్రీవేంకటేశ భువనరక్షకుఁడవు**
**పంచల నున్నాఁడ నన్నుఁ బాలించవయ్యా** ॥బల్లిదు॥**360**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ కీర్తనలో దేవదేవునే సూటిగా ప్రశ్నిస్తున్నారు. స్వామీ! నీకంటే బలవంతులు వేరే యెవరు వున్నారు? ఓ అయ్యా! నన్ను తొల్లిటి బలహీనతల బారిన పడవేయకుము, మళ్ళీ ఆ బాధలన్నీ భరించలేను అంటున్నారు. ప్రభూ! నేను ఒదిగిపోయి నీమరుగున యెందుకుజొచ్చితినో తెలుసా. నన్ను భవముల (పుట్టుకల) చెరలో చిక్కి చిక్కులలోబడి సహించలేని స్థితికి తేవద్దు. నేను చేసే కర్మలు అప్పుడెప్పుడో చేసినవైనా అప్పులమాదిరి తీర్చక తప్పదు. స్వామీ! అవి నన్నిక్కడనే చుట్టుముట్టినవి. నేనేమిసేతునయ్యా? నేను సంసారలక్ష్మిని చేపట్టిన లగ్నము అచ్చిరాక అనేక శ్రమలకోర్చి చివరకు నిన్ను చేకొంటిని. అందువలన అధికుడనైతిని. అల్లనాడు పొచ్చముల (కపటత్వములతో) పూట గడిపితిని. ఆనాడు ఋణగ్రస్థుడనై ఈనాడు వారందరిని నాబంధువలవలె పొంది ఈ బచ్చెన బంధువులతో (పైపై రంగులు పులుముకొన్న బంధువులబారినుండి) నన్ను కాపాడు స్వామీ! నా ఇంద్రియముల శత్రుత్వపీడను తప్పించుకోలేక నీ పాదములపైబడి మొఱవెట్టుకొంటిని. పొంచి వుండి నన్ను సంరక్షించే శ్రీవేంకటేశ్వరా! నీవే భువన రక్షకుడవు. నేను నీకెంతో దూరంలోకూడ లేను. నీ పక్కనే వున్నాను. నన్ను పాలించవయ్యా!

★ **పొంచిన** – పొంచివుండి ★ **యెక్కువైతిని** – అధికుడనైతిని



హరినే అడుగరో ఆమాట

సంఖ్య : IV/255 రాగం : నాదరామక్రియ పుట: 171

**6 కలఁడా యింతటి దాత కమలనాభుఁడేకాక**
**కలఁడన్న వారిపాలఁ గలిగిన దైవము** ॥పల్లవి॥

**యిచ్చెను సంపద లితఁ డింద్రాదులకునెల్ల**
**యిచ్చెను శుకాదుల కిహపరాలు**
**యిచ్చెను వాయుజునికి యిటమీఁదిబ్రహ్మపట్ట-**
**మిచ్చల ఘంటాకర్ణుని కిచ్చెఁ గుబేరత్వము** ॥కలఁ॥

**కట్టెను ధ్రువపట్టము కమలజుకంటే మీఁద**
**కట్టె విభీషణుకు లంకారాజ్యము**
**కట్టియిచ్చె నజునికి గతచన్నవేదాలు**
**కట్టెను శ్రీసతిచేతఁ గంకణసూత్రములు** ॥కలఁ॥

**పెట్టెను దేవతలకు పేరినమృతపువిందు**
**వెట్టెను భక్తవత్సలబిరు దితఁడు**
**యిట్టె శ్రీవేంకటాద్రి నిందరికిఁ బొడచూపి**
**పెట్టెఁ దనప్రసాదము పృథివి జీవులకు** ॥కల॥**255**

**భావ దర్పణము :**

అన్నమయ్య చెప్పిన ఈ చక్కని భక్తిరస ప్రధాన కీర్తనలో కమలనాభుడైన ఈ నారాయణునితో పోల్చగల దాతలు కలరా అని ప్రశ్నిస్తున్నారు. ఇతను కలడన్న వారి పాలిట కలడు అని నిరూపించిన దైవము. నేటి కలియుగంలో కొందరు దౌర్భాగ్యులు లేడని వాదిస్తున్నారు. వారికి నేనే లేనంటే నాకూ వారు లేరు, అంటాడాయన. మూర్ఖులారా! ఆయన 'దాత'. మనం గ్రహీతలం. ఇంద్రాదిదేవతలకు కల్పవృక్షముతో సహా అనేక సంపదలిచ్చాడు. శుకునివంటి మునీంద్రులకు ఇహలోకంలో శాస్వతకీర్తి పరలోకంలో తన సమీప్య మోక్షమిచ్చాడు. వాయునందనుడైన హనుమంతునికి భవిష్యత్ బ్రహ్మపట్టము నొసగినాడు. తన పేరు వినపడరాదని చెవులకు గంటలు కట్టుకొని తిరిగిన ఘంటాకర్ణునికి, కుబేరునిగా సిద్ధినిచ్చాడు. అతని కరుణ నేమని పొగడను, యెంతని పొగడను? తన భక్తుడైన ధ్రువునికి, తన కొడుకైన బ్రహ్మకంటే ఉన్నతమైన ధ్రువమండలమిచ్చాడు. విభీషణునకు స్వర్ణలంకను యొసగి యేలికను చేశాడు. అపహరించబడిన వేదములను తిరిగి బ్రహ్మకు దక్కునట్లు చేశాడు. శ్రీలక్ష్మికి చేతికి కంకణము కట్టి భార్యను చేసికొనినాడు. దేవతలందరికీ అమృతమిచ్చి అమరులను చేశాడు. భక్తవత్సలుడు అనే బిరుదుకు తనే అర్హుడనని నిరూపించుకొనినాడు. ఈ శ్రీవేంకటాద్రిజేరి తనకు శరణుజొచ్చినవారికి కావలసినవొసంగి కరుణించినవాడు. ఈ భూమిపైనున్న తన దాసులందరికి తన దివ్య ప్రసాదమును నిప్పించినవాడు.

★ **గతచన్న** – అపహరించబడిన ★ **పొడచూపి** – కనబడి

సంఖ్య : IV/458    రాగం : రామక్రియ    పుట: 308

**7 ఆంజనేయ యనిలజ హనుమంత నీ -**
**రంజకపుఁ జేఁతలు సురల కెంచవసమా ॥పల్లవి॥**

**తేరిమీఁద నీరూపు దెచ్చిపెట్టి యర్జునుఁడు**
**కౌరవుల గెలిచె సంగరభూమిని**
**సారెకు భీముఁడు పురుషామృగముఁ దెచ్చుచోట**
**నీరోమములు గావా నిఖిలకారణము ॥ఆంజ॥**

**నీమూలమునఁగాదె నెలవై సుగ్రీవుఁడు**
**రామునిఁ గొలిచి కపిరాజాయను**
**రాముఁడు నీవంకనే పో రమణి సీతాదేవిఁ**
**బ్రేమముతో మగుడను బెండ్లాడెను ॥ఆంజ॥**

**బలుదైత్యులను దుంచ బంటతనము మించ**
**కలకాలమును నెంచఁగలిగితిగా**
**అల శ్రీవేంకటపతి యండనే మంగాఁబుధి-**
**నిలయపు హనుమంత నెగడితిగా ॥ఆంజ॥458**

**భావ దర్పణము :**

అన్నమయ్య చెప్పిన ఆంజనేయ సంస్తుతి కీర్తనలన్నీ మధురంగా జనరంజకంగా వుంటాయి. ఇదిమంగాబుధిలో వెలసిన హనుమంతుని ఉద్దేశించి పాడిన కీర్తన. శ్రీవేంకటపతి రక్షణలో వున్నాడని అందువల్లనే తన భక్తకోటికి రక్షణ అయినాడట. ఓ ఆంజనేయా! వాయుపుత్రా! హనుమంతా! నీ ఆనందపరచు చేతలు యెంచుటకు దేవతలకైన అసాధ్యమేనయ్యా! తన రథముపై కేతనముగా నిన్ను నిలుపుకొనిన అర్జునుడు సంగరభూమిలో కౌరవసేనను తుదముట్టించినాడు. అదే విధముగ ధర్మజుని ఆజ్ఞపై పురుషామృగమును తేబోయిన భీమసేనుడు నిన్ను ప్రార్థించగా నీవొసగిన రోమములే ఆతనికి కార్యసాఫల్యతనొసగెను. ఓ పావనీ! నీ అమూల్యమైన సలహా వలన సుగ్రీవుడు రామచంద్రుని స్నేహము సంపాదించి కిష్కింధకు కపిసేనకు రాజయ్యెను. శ్రీరాముడు కూడా నీవలననే అనేక ఉపకారములను పొంది మరల ప్రేమతో సీతను పత్నిగా పొందెను. బలవంతులైన రక్కసులను ద్రుంచి బంటుతనమున చిరంజీవివవుదువని శ్లాఘించబడితివి. అక్కడ శ్రీవేంకటపతి అండవలన మంగాంబుధినిలయుడవైన హనుమంతుడవై నెగడితివి.

★ **పురుషామృగము** - తలపురుషుడు దేహము సింహాకారముగల రూపం

★ **నెగడితివి** - వర్ధిల్లితివి





సంఖ్య : IV/372    రాగం : సామ    పుట: 250

**8 ఇట్టిదివో హరికృప యెంచినను**
**గట్టిగా నాహరికృపే కలదువో మాకు ॥పల్లవి॥**

**బలుహిరణ్యాక్షుఁడు (?) ప్రహ్లాదునిబట్టి**
**జలధి వేసిన నీరుచట్టై తేలె**
**కలుషించి కమ్మరాను కడునగ్నిఁ దోసిన**
**నిలువెల్లఁ జల్లనినీరై తొలఁకె ॥ఇట్టి॥**

**దిట్టయై యేనుగులచే దీకొలిపిన వాఁటి (?) -**
**నట్టె కొమ్ములు తమురైపోయను**
**పట్టియెత్తి రాలమీఁద బలుమారు వేసిన**
**బట్టబయలే దూదిపానుపులై నిలిచె ॥ఇట్టి॥**

**కడసారెఁ గంభములోఁ గలఁడంటేఁ గలిగి**
**చిదుముడి రక్కసులఁ జీరివేసె**
**జడియు శ్రీవేంకటాచల నారసింహుఁడై**
**పొడచూపి మాకు దిక్కై పొదలించె నేఁడు ॥ఇట్టి॥372**

**భావ దర్పణము :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తన ప్రత్యేకత ప్రహ్లాదుని హరి భక్తి మాన్పించుటకు వానితండ్రిపెట్టిన చిత్రహింసల వర్ణన. కొన్ని పొరబాట్లు దొర్లినవి. ఇవి రాగిరేకులపై వ్రాయించిన వారి దోషములని నా భావన. హిరణ్యకశిపుని అన్నమయ్య హిరణ్యదైత్యుడని వ్యవహరిస్తుంటారు. ఇక్కడ కూడా "హిరణ్యాసురుడు" హిరణ్యాక్షడయిందని నా భావన. ఎందుకంటే ప్రహ్లాదుని పుట్టుకకు పూర్వమే హిరణ్యాక్షుడు వరాహమూర్తి చేతిలో మరణించాడు. ఇక భావదర్పణం ఆలోకించండి. ఎంచి చూచిన హరికృప ఇటువంటిదే సుమా! మాకు కూడా ఈ హరికృప గట్టిగానే కలదు. బలవంతుడైన హిరణ్య దైత్యుడు ప్రహ్లాదుని బట్టి సముద్రమున పారవేసినాడు. కాని బాలుడు నీటిపై తేలు ఉడుపులు ధరించినవానిలాగ తేలినాడు. ఆ పిదప కలుష ప్రవర్తనగల దైత్యుడతనిని గొప్ప అగ్నిలో త్రోసెను. కాని ప్రహ్లాదుడు నిలువెల్లా చన్నీట స్నానమాడినట్లు చల్లబడెను. దిట్టముగానున్న మదగజములను తెప్పించి వాని వాడియైన దంతములతో పొడిపించి కాళ్ళక్రింద తొక్కించమనెను. ఏనుగులు దంతములు విరిగి అవి బాధతో పారిపోయెను. బాలుని ఎత్తి బండరాళ్ళకేసి కొట్టి చంపివేయుడనెను. పట్టపగలే దూది పాన్పుపై పరుండినట్లు బాలుడు నవ్వెను. చిట్టచివరికి స్తంభములో హరిని చూపమని దానిని పగులగొట్టగా తాళలేని కోపముతో రక్కసుని వాని రాక్షసమూకను వాడివరములు వమ్ము పోకుండా నృసింహుడై చీల్చి సంహరించెను. ఈ శ్రీవేంకటాచలనారసింహుని దిక్కనగానే పొడచూపి మమ్ము రక్షించుచున్నాడు.

★ **కొమ్ములు** - దంతములు ★ **చిదుముడి** - తొట్రుపాటు చెందిన

సంఖ్య : IV/367 రాగం : ఆహిరి పుట: 246

**9 నే నవగుణినైన నీకుఁ బోదు భువి**
**లోన భక్తవత్సలుఁడ వటు గాన ॥పల్లవి॥**

**పరమపూరుషా భవరోగవైద్య**
**ధరణీధర మాధవ కేశవా**
**అరిది సంసారాన నలసితి నినుఁగను -**
**తెరు వేదొ వెర వేదొ తెలియ నే నిపుడు ॥నే నవ॥**

**భువనాతీతా పుండరీకేక్షణ**
**నవనీతప్రియ నారసింహా**
**యివల నాయపరాధ మెంతైనఁ గలదు నా**
**వివరము చింతించి వెసఁ గావరాదా ॥నే నవ॥**

**అగుణా సగుణా యాద్యంతరహితా**
**అగణిత శ్రీవేంకటాద్రినాథ**
**నిగమగోచర నేను నీయాధీనమ నింతే**
**నగుఁబాటు గాకుండ ననుఁగావుమిపుడు ॥నే నవ॥367**

**భావ దర్పణము :**

అద్భుతమైన ఈ కీర్తనలో అన్నమయ్య దేవదేవునుతో యేమంటున్నారో వినండి. స్వామీ నేను అవగుణిని (లోపభూయిష్టమైన గుణములు కలవాడిని). దీనివల్ల నీకు పోయేదేమున్నది? ఈ భూమిమీద నీవు భక్తవత్సలుడని ప్రసిదుడవు కదా! నన్ను కాస్త కనికరించరాదా దేవా? ఓ పరమపురుషా! భవరోగవైద్యా! (పుట్టుకలు అనే రోగము నివారించగల వైద్యుడా) భూదేవీవల్లభా! మాధవా! కేశవా! దుస్సహమైన ఈ సంసారమున అలసితిని ప్రభూ! నిన్ను చూడగల దారేదో తెలియదు. ఉపాయమేదో తెలియదు. నేనిపుడేమి చేయగలను స్వామీ. భువనములన్నీ నశించినా, నాశనములేని వాడవు. పద్మదళములవంటి కన్నులు కలవాడవు. నవనీతమనిన అంతులేని ప్రియము కలవాడవు. నారసింహమూర్తివి. ఈ భువిలో జన్మించిన నా అపరాధములకంతులేదు. మళ్ళీ ఇవన్నీ పాపఫలములే. నీవే ఈ వివరమంతా చింతించి యేదో విధి నన్ను మన్నించి వేగముగా కాపాడరాదా ప్రభూ! నీవు గుణరహితుడవు. నీవే అన్ని గుణములతో శోభిల్లువాడవు. ఆది మరియు అంతము లేని వాడవు. గణుతింపలేని వేంకటాద్రి నాథుడవు. నీవు వేదములచే గోచరమగు వాడవు. నేను నీ ఆధీనుడను. అందుచేత నన్ను నగుబాట్లపాలబడకుండా రక్షించుము తండ్రీ!

★ **వెస** – వేగమే ★ **నిగమగోచరుడవు** – వేదములచే గోచరమగువాడవు



హరినే అడుగరో ఆమాట

సంఖ్య : IV/351 రాగం : లలిత పుట: 236

**10 దైవమే నేరుచుఁగాక తగిలించ విడిపించ**
**యీవల సంసారికి నేమిసేయ వచ్చును ॥పల్లవి॥**

**ఆస యెచ్చోట నుండు నక్కడ దైన్యము నుండు**
**వాసులన్నీ నెందు నుండు వన్నెలు నందుండు**
**వేసట యెక్కడ నుండు వీతరాగ మాదనుండు**
**యీసుల నీలంకెవాప నెవ్వరికిఁ దరము ॥దైవ॥**

**అతికోప మేదనుండు నజ్ఞాన మాదనుండు**
**మతిఁ బంత యెందుండు మత్సర మందుండు**
**మతకము లేదనుండు మాయలును నందు నుండు**
**యితరు లెవ్వరు నిందు కేమనఁగలరు ॥దైవ॥**

**తనభక్తి యెందుండు తపమును నందుండు**
**మనసెందు నుండు దీమసమును నందుండు**
**తనివి యొక్కడ నుండు తగు సుఖ మందుండు**
**తనర శ్రీవేంకటేశు దైవికము లివియే ॥దైవ॥351**

**భావ దర్పణము :**

అన్నమయ్య బహుచక్కని ఈ అధ్యాత్మకీర్తనలో యేమంటున్నారో ఆలకించండి. శ్రీవేంకటేశ్వరుడే దేవదేవుడైనందున జీవుల జీవనయానంలో సహజములైన దైన్యములు, రాగద్వేషములు, వన్నెలు, అసూయలు, క్రోధము, అజ్ఞానము, మత్సరము, కపటములు, భక్తి తపస్సు – ఇటువంటి సద్గుణములు దుర్గుణములన్నీ ఆ స్వామి కల్పితములే. ఎవరి భాగ్యమునకు యేదిస్తాడో యెవరికెరుక. మరి దారేమిటి. ఆ తిరుమలేశుని శరణాగతియే. ఆ దైవమే జీవుల కలయికలను, యెడబాట్లను కల్పిస్తాడు కదా! ఇక సంసారియైన జీవుడేమిసేయగలడు? ఇది గమనించారా? ఆశ యెక్కడ వుంటుందో దీనత్వమూ అక్కడే వుంటుంది. అధికారమెక్కడ చెలరేగుతుందో అక్కడ సౌందర్యం శిరస్సు వంచుతుంది. అలసట యెక్కడుంటుందో, కొరడా ఝుళిపించే అనురాగం అక్కడే వుంటుంది. ఈ లంకెలను బాపుట యెవ్వరితరము? అపరిమితమైన క్రోధమున్నచోట అజ్ఞానముండితీరుతుంది. పంతము వున్నచోట మాత్సర్యము వుంటుంది. మోసపుచ్చుట జరిగే చోట మాయలు సహజంగానే వుంటాయి. ఎవరైనా దీనికేమనగలరు? భక్తి యెక్కడుంటుందో, తపశ్శక్తీ అక్కడే వుంటుంది. మనస్సెక్కడుంటుందో ధైర్యమూ అక్కడే వుంటుంది. తృప్తి యెక్కడుంటుందో, సుఖమూ అక్కడే వుంటుంది. శ్రీవేంకటేశ్వరుని దైవికఘటనలివియే.

★ **ధీమసము** – ధైర్యము ★ **వాసులు** – ఆధిక్యతలు

సంఖ్య : IV/377 రాగం : దేవగాంధారి పుట: 253

**11 ఏదైన దేవుఁడు ప్రాణికియ్యక లేదు**
**పాదుగ నాతనిమీఁది భక్తే సాధనము ॥పల్లవి॥**

**దేహమునకు ఫలము తెగని యాలుబిడ్డలు**
**దేహాంతరాత్మకును దేవుఁడొకఁడే ఫలము**
**దేహమే బంధకము దేవుఁడింతే మోక్షము**
**వూహల రెంటికి మనసొక్కటే సాధనము ॥ఏదైన॥**

**పుట్టినందుకు ఫలము పొందగు భోగములే**
**పుట్టుగే గెలుచుటకు భువి జ్ఞానమే ఫలము**
**పుట్టుటకుఁ గర్మము పోవుటే యకర్మము**
**వెట్టే యీ రెంటికిని విరతే సాధనము ॥ఏదైన॥**

**చింతించుటకు ఫలము సిరులెల్లఁజేకొనుటె**
**చింత వీడుటకు ఫలము శ్రీవేంకటేశు సేవే**
**చింతలే దుఃఖములు నిశ్చింతములే సుఖములు**
**కొంత దాఁచనేల శ్రీ గురుఁడే సాధనము ॥ఏదైన॥377**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ కీర్తనలో ఏ దేవుని కొలిచినా, ఏ దేవుని నుంచి వరములను పొందాలన్నా ఆ దైవముపై అచంచల భక్తి ప్రదర్శించుటే సాధనము అన్నారు. భగవంతుని వలననే మనకి దేహము, పుట్టుక, చింతన, దుఃఖము, నిశ్చింత, సుఖము ప్రాప్తిస్తున్నాయి. మరి భక్తి ప్రసాదించేది సద్గురుడే. జీవికి దేహము లభించగానే దాని ఫలితంగా ఆలుబిడ్డలతో తెగని అనుబంధం కలుగుతుంది. దేహాంతరాత్మ ఫలితంగానే దేవుని తెలియగలము. అందుకే ఈ దేహమే ముక్తికి ప్రతిబంధకమూ, సాధనమూ కూడా. ఆలోచిస్తే మనస్సే ఈ రెంటికీ కారణము. జీవికి ముక్తి కలగాలన్నా రక్తి కలగాలన్నా మనస్సొక్కటే మార్గము. సరే! పుట్టుక వచ్చింది. దాని ఫలితమే జీవికి భోగకాంక్ష. మరి పుట్టుక గొప్పదనిపించుకోవాలంటే జ్ఞాని కావలెను. మళ్ళీ ఈ భోగాసక్తి, జ్ఞానాసక్తి కర్మలనే ప్రోత్సహిస్తాయి. ఈ రెండు విధములైన కర్మలు పుట్టుకలకే తావిస్తాయి. కర్మలు పోతే అకర్మముతో వుండవచ్చు. ఈ కర్మ, అకర్మ రెండూ విరతివల్లనే సాధించగలము. తెగ చింతించేవాడు సిరులన్నీ పొందాలనే ఆరాట పడతాడు. చింతవీడినవాడే వేంకటేశుని సేవించగలుగుతాడు. అప్పుడా జీవి ఒక సత్యాన్ని తెలుసు కొంటాడు. చింతలే దుఃఖహేతువులు. నిశ్చింతయే సుఖమునకు హేతువు. ఇంత చెప్పిన పిదప అసలు సంగతి దాచటం యెందుకు, శ్రీవేంకటేశ్వరుని తెలియాలంటే సద్గురుడే సాధనము.

★ **విరతి** – ఆపేక్షలేకుండుట ★ **అకర్మము** – ఏ కర్మము చేయకుండుట





సంఖ్య : IV/383 రాగం : శంకరాభరణం పుట: 257

**12 ఎప్పు దేబుద్ధి వుట్టునో యెరఁగరాదు**
**దెప్పరపుమాబ్రదుకు దేవునికే సెలవు ॥పల్లవి॥**

**యేడనుండి పుట్టితిమో యింతక తొల్లి యింక –**
**నేడకుఁ బోయెదమో యిటమీఁదను**
**వీడని మాయంతరాత్మ విష్ణుఁడు మా –**
**జాడ జన్మమతనికే సమర్పణము ॥ఎప్పు॥**

**గతచన్న పితరు లక్కడ నెవ్వరో**
**హితవై యిప్పటి పుత్రు లిదియెవ్వరో**
**మతి మాజీవనమెల్ల మాధవుఁడు**
**అతనికే మాభోగాలన్నియు సమర్పణము ॥ఎప్పు॥**

**తొడికి స్వర్గాదులు తొల్లియాడవో యీ –**
**నడచే ప్రపంచమునాకేడదో**
**కడఁగి శ్రీవేంకటేశు గతియే మాది**
**అడఁగు మాపుణ్యపాపా లతని కర్పణము ॥ఎప్పు॥383**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఆలపించిన ఈ అధ్యాత్మకీర్తన సారాంశమేమంటే మనం వానరబుద్ధి గలిగిన నరజాతి వారము కాబట్టి మనకు యెప్పుడేబుద్ధి పుడుతుందో తెలియదు. మన బ్రతుకు ఆపదల భూయిష్టము. ఇది దేవుడు ఆజ్ఞగా ఇచ్చినది. ఇష్టమైనా కష్టమైనా భరించక తప్పదు. అంతే. ఇంతకు పూర్వం యెక్కడవున్నామో? అక్కడనుంచి యెక్కడకు వెళ్ళి ఇక్కడకు వచ్చామో ఎవరికి తెలుసు? మమ్మల్ని యెడబాయని అంతరాత్మగావున్న విష్ణువుకే మా జాడ తెలియును. అందుకే నా బ్రతుకు ఆ శ్రీహరికే సమర్పణము. అక్కడెక్కడో వున్న ఆ నాటి నా తండ్రి యెవ్వరో నేనీనాడెరుగుదునా? ఈనాటి ప్రియసుతులను ఆనాడు వారెవరో నేనెరుగుదునా? ఈనాడు మతి తెలిసిన మా జీవనమంతా మాధవుడే సుమా! ఆయన మా కొసగిన భోగములన్నీ ఆయనకే నివేదించుచున్నాను. అస్థిరమైన స్వర్గమున ఇదివరలో యెన్నిసార్లు ప్రవేశించానో. నడచే ఈ ప్రపంచమున యెన్నిసార్లు జీవించానో ఇది నాకెట్లా వచ్చిందో యెవరు చెప్పగలరు? ఇదంతా యెందుకు జరుగుతోంది? మా పాపపుణ్యములను మేము నిరంతరం అనుభవిస్తూనే వున్నాము. మా గతి ఆ శ్రీవేంకటేశ్వరుడే. అందుకని నా పాపపుణ్యములను ఆయనకే అర్పిస్తున్నాను.

★ **తొడికి** – అస్థిరమైన ★ **దెప్పరపు** – ఆపదల మయమైన

సంఖ్య : IV/423 రాగం : సామంతం పుట: 284

**13 ఇన్నివిధాలు యింకనేల ప్ర -**
**పన్నుఁడై మీఁద బహువిధులేలా ॥పల్లవి॥**

**సతతభూతదయ సత్యవాక్యము గలిగితే**
**కుతిలపు ధర్మాలగొడవలేలా**
**ప్రతిలేని విజ్ఞానభావశుద్ధి గలిగితే**
**మతకపుఁ గర్మాలు మరియేలా ॥ఇన్ని॥**

**పొందుగ నిన్నిటను సమబుద్ధి నిలిచితేను**
**సందడిలోఁ దీర్ఘాచరణలేలా**
**నిందమాని యాసమాని నిర్మలచిత్తులయితే**
**వందదైనవుపవాసవ్రతము లేలా ॥ఇన్ని॥**

**శ్రీవేంకటపతి చింతనము గలిగితే**
**పావనపు శాస్త్రాల పఠనలేలా**
**ఆవల నీతని దాసులందుఁ బ్రేమ గలిగితే**
**కావరపుటితర సంగతులేలా ॥ఇన్ని॥423**

**భావ దర్పణము :**

ప్రపన్నుడు అంటే శరణాగతి పొందినవాడని అర్థం. విశిష్టాద్వైతంలో ప్రపన్నులకు తమ గురువే దైవము. దైవము ఒక్క శ్రీహరియే. వారి శరీరంపై వారు వేయించుకొన్న శంఖు చక్రముల ముద్రలు, నొసట ధరించే తిరునామము వారి శరీరాన్ని పునీతం చేసిందని నమ్ముతారు. అట్టి అన్నమాచార్యులవారి కీర్తన యేమిచెబుతున్నదంటే ప్రపన్నుడైన వానికి బ్రాహ్మణ దీక్షలు, వేదాధ్యయనాలు, ఉపవాసాలు, వ్రతములు కూడా అవసరం లేదు. ప్రపన్నుడైన మీదట బహువిధములేల? అని ప్రశ్నిస్తున్నారు. మరి వారికేం కావాలో వినండి. ఎల్లప్పుడూ భూతదయ, సత్యవాక్యము పలుకుట, వుంటే కుతిలపు (బాధపెట్టే) ధర్మవర్తనము గొడవయెందుకు? పరమాత్మను గూర్చిన జ్ఞానము ప్రతిలేనిది. అదివుంటే... మతకపు (మాయదారి) కర్మలు (కర్మాచరణ) మరి యేల? మానవ జన్మనెత్తాక మంచీ చెడూ రెండూ అనుభవించక తప్పదు. మంచికి పొంగి చెడుకు క్రుంగుట తగదు. వీటిపై సమబుద్ధి కలిగితే ఆర్భాటానికి పెద్ద పీటవేసే సుదీర్ఘమైన ఆచారముల అవసరం యేమున్నది? పరదూషణ మానివేసి, ఆశని పరిత్యజించిన నిర్మల హృదయులైతే సంతాపము కలిగించు ఉపవాస వ్రతదీక్షలెందుకు. శ్రీవేంకటపతి చింతగలిగి సదా ఆ స్వామిని స్మరించువానికి పుణ్యప్రాప్తినిచ్చే శాస్త్రపఠనమూ అనవసరమే. అటుపై ఆయన దాసులైన వారికి భూతదయ, ప్రేమాస్పదమైన హృదయముంటే మదము కలిగించే ఇతర సంగతులేల?

★ **వందదైన** – సంతాపము కలిగించు ★ **కావరము** – మదము కలిగించే





సంఖ్య : IV/382 రాగం : మంగళకౌశిక పుట: 256

**14 ముట్టితేనే మూయైఁ బట్టితేనే పంతమయీ**
**ఇట్టె మమ్ముఁగావవే యిందిరారమణ. ॥పల్లవి॥**

**తీరుగాఁ బుణ్యముసేసితే జన్మబంధమై (మయీ?)**
**తోరపు నాపాపములైతే దుఃఖమైని (మయీని?)**
**వూరకుంటే నీప్రపంచ ముల్లంఘించినట్టై**
**యేరీతి నడచువార మిందిరారమణ ॥ముట్టి॥**

**అంకె దయఁ దలఁచితే నన్నిటికిఁ దగులై**
**కొంకక కోపించితేనే క్రూరమ్మైని**
**మంకున నూరకవుంటే మదోన్మత్తుఁడై**
**యింకనేమి సేయువార మిందిరారమణ ॥ముట్టి॥**

**యిన్ని చిక్కులునేల యిట్టె శ్రీవేంకటేశ**
**మిన్నక నీశరణంటే మేలైని**
**వెన్నెల నీయర్థమే వేదశాస్త్రసమ్మతై**
**యెన్న నీవే సేయువాఁడ విందిరారమణ ॥ముట్టి॥382**

**భావ దర్పణము :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనను పూర్తిగా అర్థం చేసికొనుట కొంచెం కష్టమే. భగవంతుడు వారిచేత పలికించిన పలుకులను మనబోటి సామాన్యుల అవగాహన కందటంలేదని సరిపెట్టుకోవాలి. అంతే. అయినా, మానవప్రయత్నం చేస్తున్నాను. అటుపైన ఏడుకొండలవాడి దయ. ఓ ఇందిరారమణా! మానవమాత్రులమైన మేము పట్టుదలగా చేయబోతే పంతము అవుతుంది. ముట్టుకుంటే మూడు విధములుగా అవుతుంది. అది పుణ్యమో, పాపమో, ప్రాపంచిక సర్దుబాటో అవక తప్పదు కదా! మరి ఫలితం అనుభవించక మాకు తప్పుతుందా? ఈ స్థితినుంచి మమ్ము కాపాడవయ్యా! ఒకవేళ పుణ్యం చేస్తే మంచి జన్మనివ్వక మానవుకదా! అదే పాపం చేశామంటే దుఃఖమై తీరుతుంది కదా! ఏ కర్మమూ చేయక వూరకుండనిస్తుందా ప్రపంచము? అదీ నిన్నుల్లంఘించినట్లేకదా! మరి యేరీతి నడవాలయ్యా? దయాగుణంతోవుంటే అన్నిటికి తగులౌతాము కదా! అలా కాదని వెనుకాడక కోపగుణంతో రుసరుసలాడుతుంటే క్రూరుడనంటున్నారే? సరే! ఇట్లా కాదని మంకుతనంతో వూరకనుంటే వీడు మదోన్మత్తు డంటున్నారు. ఓ ఇందిరా రమణా! ఇంకా యేమి చేయగలను? ఓ శ్రీవేంకటేశ్వరా! ఇన్ని చిక్కులనెందుకు పెడుతున్నావయ్యా? మిన్నక నీ శరణు అంటేనే మేలుకదా! ప్రేమోన్మాదము కలిగించే వెన్నెలా నీవిచ్చినదే. వేదశాస్త్రమూ నీవిచ్చినదే. ఈ రెంటిలో ఏదో వొకటి మేము యెన్నుకొనేలా చేసేవాడివీ నీవే ఇందిరారమణా!

★ **తగులై** – బంధమై ★ **ఉల్లంఘించినట్లే** – వ్యతిరేకించినట్లే

సంఖ్య : IV/386 రాగం : భైరవి పుట: 259

**15 సందడిసొమ్ములతోడిసాకారమిదె వీఁడె**
**యిందరు వర్ణించరే యీరూపము ॥పల్లవి॥**

**చుక్కలతో నాకాశము సూటై నిలువఁబోలు**
**నిక్కి రత్నాలజలధినీటుగాఁబోలు**
**మిక్కిలి నానావర్ణ మేఘపంక్తిగాఁబోలు**
**యిక్కడనే నిలుచున్న దీరూపము ॥సంద॥**

**నించినపంచవన్నెలనీలగిరిగాఁబోలు**
**అంచల సంధ్యాకాల మదిగాఁబోలు**
**చించ కాతని మెరుఁగుల చీఁక టిదిగాఁబోలు**
**యెంచఁగ నలవిగాదు యీ రూపము ॥సంద॥**

**పున్నమ సమాసయు పోగై నిలువఁబోలు**
**వున్నతి యోగీంద్రుల యూహగాఁబోలు**
**పన్నిన బ్రహ్మాండాలభర ణిదిగాఁబోలు**
**యిన్నిట శ్రీవేంకటేశు యీ రూపము ॥సంద॥386**

**భావ దర్పణము :**

సర్వాభరణ శోభితుడైన వేంకటరమణమూర్తిని పులకితగాత్రులైన అన్నమయ్య యెలా వర్ణిస్తున్నారో ఆలకించండి. ఆ కాలంలో ఆభరణాలను సొమ్ములు అనేవారు. నేడు మనం నగలు అంటున్నాము. శ్రీవేంకటేశ్వరుని సాకారరూపమునకు అలంకరింపజేసిన ఆభరణాలు సవ్వడి చేయుచున్నవి. ఇందరు (భక్తులందరూ) ఈ రూపమును వర్ణించరే. నల్లని ఈ దేవదేవుని రూపముపై ఆ నగలు మెరుస్తుంటే, నల్లని ఆకాశముపై కాంతులీను నక్షత్రములన్నీ మెరుస్తున్నట్లే వున్నది. నల్లని సాగరమున మెరయు రత్నములు పైకితేలి నిక్కి చూస్తున్నవా అనునట్లు వున్నది. సంధ్యా సమయమున నానావర్ణముల మేఘ పంక్తులు గుమిగూడినవా!! అన్నట్లున్నది. ఆ విధముగా ఈ రూపము ఇక్కడ నిలుచున్నది. పంచవన్నెలతో మెరయుచున్న నీలాద్రియా అనునట్లున్నది. సంధ్యాసమయమైనందున నీలాద్రిపై పంచవన్నెల శోభ అతిశయించెనా అన్నట్లున్నది. మెరుస్తున్న చీకటియా యేమి అని భ్రమ కలుగుతున్నది. ఈ రూపము ఇలాంటిది అని యెంచనసాధ్యముగానున్నది. అమావాశ్య రేయిలో పున్నమి వచ్చిందా అన్నట్లున్నది. ఉన్నతమైన యోగీంద్రుల ఊహా చిత్రమా అన్నట్లున్నది. పదునాల్గు భువనాలు దాచిపెట్టిన "భరిణ" కాబోలు అన్నట్లున్నది. ఇన్ని విధములుగా శోభించుచున్నది ఈ శ్రీవేంకటేశుని రూపము.

★ **సందడి సొమ్ములు** – సవ్వడి చేయు నగలు ★ **అలవిగాదు** – అసాధ్యమైయున్నది.





సంఖ్య : IV/385 రాగం : పాడి పుట: 258

**16 నమ్మిన దిదివో నాపితురార్జిత –**
**మిమ్మహిఁ జూడరో యిది మీదిగాదు. ॥పల్లవి॥**

**నలినదళాక్షునినామాంకితమే**
**నిలువునఁ బాఁతిన నిధానము**
**కలకాలమిదే గాదెలకొలుచులు**
**నలుగడ నివియే నాలుకరుచులు ॥నమ్మి॥**

**శ్రీపతిరూపమే చింతించు తలఁపే**
**పైపై మాయింటి భాగ్యములు**
**పూఁపలమిత్రులుఁ బుత్రాదు లిది (వి?)**
**వైపగు మాకిదె వ్యవసాయములు. ॥నమ్మి॥**

**శ్రీ వేంకటపతి సేవిది యొకటే**
**భావించు నాయుష్య భౌష్యములు (భవిష్యము)**
**కైవల్యపదమిదె కాయజసుఖమిదె**
**సావధానముల సంసార మిది (దే?) ॥నమ్మి॥385**

**భావ దర్పణము :**

మనలో చాలామంది యేదేని ఆలయాన్ని సందర్శించినపుడు అక్కడి అర్చా మూర్తిని అరనిముషం ధ్యానించగలిగితే గొప్ప. అన్నమయ్య యేమంటున్నారంటే ఆ అరనిముష ధ్యానం పుణ్యాన్ని సముపార్జించును. కైవల్యం కోరేవారు వేంకటపతి సేవ, కలకాలమూ నిష్కామ నిరపేక్షలతో చేయాలి. లేదా మనం పుణ్యార్హులమే కాని మోక్షార్హులంకాము, కాలేము. ఇది నా అభిప్రాయం కూడా. భక్తులారా! ఈ నమ్మకము పిత్రార్జితములాగ తరతరాల నుండి వస్తున్నదే. ఈ మహిలో ఆలోచించి చూస్తే మీ అభిప్రాయం కూడా ఇది కాదంటారా? హరి భక్తియే భూమిలో దాచిన నిధానమువలె మనల్ని ఆదుకొంటుంది. నళినదళాక్షుని నామమే మనందరి గతి. ఏ కాలములో నైనా గాదెలలోనుంచి తీసి కొలిచి ఇచ్చే ధాన్యం ఈ హరి నామము. పైగా ఇది ఒకే ధాన్యం కాదు. ఎవరికేది రుచి యైతే ఆ ధాన్యం. అలవోకగా మా ఇంటిలో కూర్చొని మేము సముపార్జించే భాగ్యము ఈ శ్రీపతి రూపమునే చింతించుచు కొనసాగే మా ఆలోచనలు. పూనికగల మిత్రులు, పుత్రులు మొదలైనవారితో మేము చేసే కృషి ఈ హరిసేవే. ఇదే మా లక్ష్యము కూడా. భవిష్యత్తులో మమ్ము ఆయుష్మంతులను చేసేది ఈ శ్రీవేంకటపతి పదసేవ ఒక్కటే. ఈ స్వామి సేవే మోక్షమార్గం; సందేహం లేదు. మన్మథ సౌఖ్యము కావాలన్నా, సంసారంలో సావధానముగా వుండాలన్నా ఈ నామమే గతి.

★ **పూపల** – పూనికగల ★ **వ్యవసాయములు** – కృషి

★ **వైపు** – లక్ష్యము ★ **కాయజసుఖము** – మన్మథ సౌఖ్యము

సంఖ్య : IV/417    రాగం : గుండక్రియ    పుట: 280

**17** నీచమైననావల్ల నెరవై దైవమా
చీ చీ యిన్నివిధులఁ జిక్కువడె బదుకు ॥పల్లవి॥

యెదుటివేమైనఁ గోరు నింతలోనే మనసు
అది సంభవించకున్న నలమటపడుఁ దాను
కదిసి చేకూరితేను ఘనమై హర్షించు
వెద నీరువంక తుంగ విధమాయ మనసు ॥నీచ॥

యెక్కడికైన నేఁగు నెరఁగక తనువు
అక్కడ దుర్లభమైతే నంతలో వేసారు
దక్కి యందే సుఖమైతేఁ దానే విఱ్ఱవీఁగు
గక్కున రొంపిలోని కంభమాయఁ దనువు ॥నీచ॥

యెందుకైన సమ్మతించు నిరవైన జీవుఁడు
చెందిన పసిఁడికి చెలులకే మత్తుఁడౌను
కందువ శ్రీవేంకటేశ కరుణించవయ్య యింక
పొంది వఱటచెలమాయఁ బుట్టుగుల సివము ॥నీచ॥**417**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ కీర్తనలో, నీచమైన తన వల్ల సర్వ వ్యాపకత్వము గల దేవునిచే ఇవ్వబడిన మానవ జన్మకూడా వ్యర్థమై పోయింది. ఛీ ఛీ తన బ్రతుకంతా అన్నివిధములా చిక్కుల పాలైనది అని చింతిస్తున్నారు. మానవునికి ఈ ఆవేదనకు కారణము వాని మనసు, తనువు మరియు జీవుడు. ఎందుకో వినండి మరి. మనస్సువున్నదే... అది చూసినదల్లా కావాలంటుంది. అది దొరక్కపోతే చింతిస్తుంటుంది. ఒకవేళ చేకూరితే దాని ఆనందానికి అవధులుండవు. నీటి ప్రవాహంలో గడ్డిపోచను అదుపు చేయటం యెవడితరమౌతుంది? మానవుని తనువు వున్నదే... అది సుఖాన్వేషణలో పోకూడని చోట్లకూ, పోతుంటుంది. అక్కడా ఆ తనువు కోరిన సుఖం దొరక్కపోతే విసిగిపోతుంది. ఒకవేళ అనుకున్న సుఖం, దక్కితే యెంతో విఱ్ఱవీగుతుంది. ఈ తనువుతో వ్యవహారం బురద రొచ్చువున్న స్తంభం యెక్కడం లాంటిది. చివరి దాకా యెక్కినా నేలమీదకి జారిపోవచ్చును. అదంతే. ఇరవైన జీవుడు దేనికైనా సమ్మతిస్తాడు. వాడిదేమివుంది? కాంతా కనకాలకిబానిసవాడు. ఓ శ్రీవేంకటేశ్వరా! కాస్త ఈ దౌర్భాగ్యుడిని కరుణించవయ్యా! ఇటు చూడబోతే నాకు నువ్వియ్యబోయే జన్మలు వూట చెలమ వూరినట్లు శివాలెత్తి ఆడుతున్నాయి.

★ **తుంగ** – గడ్డిపోచ ★ **సివము** – శివాలెత్తుతాయి ★ **ఇరవు** – స్థిరపడు





సంఖ్య : IV/392    రాగం : ముఖారి    పుట: 263

**18** ఒలపక్షము లేనొక్కదేవుఁడవు
నలినాక్ష హరీ నమో నమో ॥పల్లవి॥

నేరిచిన నే నేరకుండిన నీ
కారుణ్య మొక్కటే కలది
పారి ఘంటాకర్ణుభక్తికి సరిగా
చేరి శుకాదులఁ జేకొంటిగాన ॥ఒల॥

సాద(దు)నైన నేఁ జల(డ)మతినైనా నీ
పాదమొక్కటే నేఁ బట్టినది
పాదైనవసిష్ఠుభక్తికి సరిగా
మేదిని వాల్మీకి మెచ్చితిగాన ॥ఒల॥

యేమిటా శ్రీవేంకటేశ యెంతైన నీ
నామమొక్కటే నే నమ్మినది
సామజముభక్తి సరిగా నీవును
ప్రేమతోఁ బ్రహ్లాదుఁ బెంచితిగాన ॥ఒల॥**392**

**భావ దర్పణము :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో “శ్రీహరి భక్త సులభుడు, భక్తప్రియుడు అవటంచేత ఇదేమిటి ఈయన శుకమహర్షిని, ఘంటాకర్ణుడు వంటి రాక్షసుణ్ణీ ఒకే విధంగా చూస్తున్నాడు? ఇదేమి ఘోరం! ఇదేమి కారుణ్యం!! అనిపిస్తుంది. కాని ఆయన అంతరంగాన్ని అర్థంచేసికొనే శక్తి మనకున్నదా అంటున్నారు. ఇది చదివి మన పొరబాట్లు దిద్దుకొందాం. ఓ కమలాక్షా! నీవు ఒలపక్షము (పక్షపాతము) లేని ఒకే ఒక దేవుడవు. శ్రీహరీ! నీకివే నా నమోవాకములు. నేను పండితుణ్ణయినా, పామరుణ్ణయినా నీ కారుణ్యమొకేవిధంగా వుంటుంది. నీ నామమే చెవులకు సోకరాదు, అని చెవులకు ఘంటలు కట్టుకొని తిరిగిన ఘంటాకర్ణునీ, పుట్టిన వెంటనే నీ తపస్సులో గడిపిన భాగవత ప్రవక్త శుకమహర్షికీ ఒకే విధమైన మోక్షం ఇచ్చావు. ఏమి వింత? ప్రభూ! నేను సాధుపుంగవుడినైనా లేక మందబుద్ధినైనా నీ పాదమునే శరణన్నవాడను. ఎందుకంటే... బాటసారుల్ని దోచుకొని పీడించే వాల్మీకిని, సప్తఋషులలో అగ్రగణ్యుడైన బ్రహ్మర్షి వసిష్ఠుని జగత్ప్రసిద్ధుల్ని జేసి తారలుండే వరకు నిలిచిపోయే కీర్తి ప్రతిష్ఠలనిచ్చావు. నిన్నేరీతి నెరుగగలము? ఏదియేమైనా, ఓ శ్రీవేంకటేశ్వరా! నీనామమొక్కటే నేను నమ్మినది. ఎందుకో తెలుసా స్వామి? దినదినగండంగా బ్రతుకుతున్నవాడిని నేను. కాని నీ శరణాగతుడను. నీ శరణాగతులైన గజేంద్రుని పరుగున రక్షించావు, ప్రహ్లాదుని ప్రేమతో పెంచి పెద్దచేసి రక్షించావు. మరి నాకు నీకంటే రక్షకుడెవరు?

★ **ఒలపక్షము** – పక్షపాతము ★ **పాదైన** – నిలకడగల

సంఖ్య : IV/421 రాగం : దేవగాంధారి పుట: 282

**19** హరి నీకే నే రుణ మత్తుఁగాక తగవైతే
వొరిమ నొకరియ్యఁగ నొకరికి దిద్దుటా ॥పల్లవి॥

మొలచు జననలోకమునకు నుదుట వ్రాసే
బలుఁడ నీచే నేఁ బత్రసాల మందుకొంటి
పెలుచు దేవతలకు పితరులకు రుణము
యిల నత్తునట యివి యేనాటి రుణము ॥హరి॥

యేయెడ నేమిసేసి యేలోకమందున్నా
పాయని నీవే నాకు ప్రాణబంధుఁడవైతి
కాయపుఁ జుట్టిరికాలు ఘన రుణానుబంధ
మీయెడఁ గలిగెనట యేనాటి రుణము ॥హరి॥

శ్రీవేంకటేశ నీవీ చిక్కులఁబెట్టి నాకు
కావిరిఁ గర్మాలు మెడఁ గట్టితివిగా
సోవల నీశరణము చొచ్చిన నాకు నివి
యేవూరి కేవూరు యేనాఁటి రుణము ॥హరి॥**421**

**భావ దర్పణము :**

"ఋణానుబంధరూపేణా పశుపత్నీసుతాలయ" అన్నారు పెద్దలు. అన్నమయ్య కూడా ఈ కీర్తనలో యేమంటున్నారో వినండి. ఓ శ్రీహరీ! నీకే నేను ఋణమును కలిగియున్నానయ్యా! భలే తగవుపెట్టినావే. ఒరిమ (ఒద్దికతో) ఒకరికీ అన్నీ ఇచ్చెదవు. ఇంకొకరికి అన్నీ దిద్దుటా (సవరించుకొనుటా?) ఇదేమి పక్షపాతబుద్ధి నీకు, స్వామీ! ఈ లోకమున జననముతో మొలచునప్పుడే, బలవంతుడవైన నీచే 'పత్రసేవ' (ఋణపత్రమును) నేను పొందియుంటిని. నేను దేవతల ఋణము, నాపితృదేవతల ఋణము తీర్చవలెనట. ఇలలో నాకు కలిగిన వారి ఋణము, తీర్చక తప్పదట. కానీ ప్రభూ! ఇది యేనాటి ఋణమయ్యా? ఏనాడైనా, ఏలోకమందున్నా, యేమిసేసినా, విడలేని నీవే నాప్రాణబంధుడవైతివి. నా ఈ దేహముతో కలిగిన చుట్టరికాలు అన్నీ గొప్ప ఋణానుబంధము వలన కలిగినవే. అయితే ఇవన్నీ యే తీరుగా గలిగినవి? ఇవి యేనాటి ఋణాలు? ఇప్పుడెందుకు తీరుస్తున్నాను? ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు నాకు ఈ చిక్కులన్నీ యేల పెట్టితివయ్యా? ఈ నల్లని పాపకర్మలను నామెడకేల అంటగట్టితివయ్యా? ప్రత్యక్షముగా నీ శరణాగతి బొందియుంటిని. ఏ వూరికి యేవూరు ఋణము తీరదో అదే ఆ వూరిలో స్థిరపడేట్లు చేస్తుంది.

★ **కావిరి** – నల్లని ★ **సోవల** – ప్రత్యక్షముగా





సంఖ్య : IV/422 రాగం : శ్రీరాగం పుట: 283

**20** విన్నప మిదే నీకు వేవేలు విధముల
నన్నుఁ గావవే హరి నమో నమో ॥పల్లవి॥

నీగుణము నేనెరిఁగి నిన్నుఁ గొలువనేర
నాగుణము నీవెరిఁగి నన్ను నేలుకొనవయ్య
సాగరము నీవు దచ్చి సతిఁ దెచ్చుకొన్నట్టు
నాగశయనుఁడ హరి నమో నమో ॥విన్నప॥

నీవున్నచో టెరిఁగి నిన్నుఁ దలఁచనేర
నావున్నచో టెరుఁగుదు నన్ను నీవు దలఁచవే
కోవిదుఁడ నారఁ బేరుకొన్నవానిఁ గాచినట్టు
నావొడయ హరిహరి నమో నమో ॥విన్నప॥

మనసులో నున్న నిన్ను మరవకుండ నేర
మనసులోని నీవే నామరపు దెలుపవయ్య
పనివడి యహల్యఁ బాదమునఁ గాచినట్టు
ననిచి శ్రీవేంకటేశ నమో నమో ॥విన్నప॥**422**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ కీర్తనలో హరికి నమోవాకములనర్పిస్తూ ఒక విన్నపము చేస్తున్నారు. నావంటి సామాన్యుణ్ణి కాపాడటానికి నీవు క్షీరసాగర మథనం చేయనక్కరలేదు. కారడవుల్లో తిరిగి అహల్యకు శాపవిమోచన చేసినట్లు కష్టపడనక్కరలేదు. అయినా నారాయణా అనికూడా అనలేక 'నారా' అన్నవానికీ వైకుంఠమునిచ్చావు కదా! ప్రభూ! నమోనమో అని ఎన్నాళ్ళనుంచి వేడుకొంటున్నాను? నన్ను కరుణించరాదా? నేను నిన్ను ఆజ్ఞాపించుట లేదయ్యా! వేవేల విధముల ఆర్తత్రాణపరాయణుడవని నిరూపించుకొన్నావు. ఓ శ్రీహరీ! నన్ను కాపాడవయ్యా! నీ ఆర్తరక్షక గుణము నెరిగి నిన్ను కొలవని, దౌర్భాగ్యుడను. పోనీ నా నీచగుణం నీవెరుగుదువు కదా! నన్నేలుకోరాదా? కూర్మావతారమెత్తి క్షీరసాగర మథనానికి నీవు అంత కష్టపడి, క్షీరాబ్ధికన్యను తెచ్చుకోలేదా? ఓ హరీ! పన్నగశయనా! నమోనమో. నన్ను చేపట్టరాదా? నీవెప్పుడు గజేంద్రునివంటి ఆపన్నులను రక్షించటానికి ఏమారుమూలనుంటావో మాకెలా తెలుస్తుందయ్యా? కానీ నేనుండేచోటు నీవు యెరుగుదువు కదా! నీవు వచ్చి రక్షించరాదా? సర్వజ్ఞా! 'నారాయణా' అనికూడా అనలేక 'నార' అని ప్రాణాలు వదలిన అజామీళునికి వైకుంఠమునిచ్చావే, నా నాథుడవైన హరీ! నీకు నమోవాకములు. ప్రభూ! నా మనస్సులో వున్న నిన్ను మరువలేను, మరి నా మనస్సులోన నీవే నావెతలను హరించవయ్యా! కారడవిలో నడచి వెళ్ళి పాదముతో తాకి అహల్యకు శాపవిమోచనం చేయలేదా? అట్టి శ్రీవేంకటేశా! నీకు నమోవాకములు

★ **ఒడయడు** – నాథుడు ★ **ననిచి** – అనురాగముతో

సంఖ్య : IV/414    రాగం : లలిత    పుట: 278

**21 నేనై విడువవద్దు తానై తగులవద్దు**
**తానే తానై వుంటేఁ దగులెల్ల నూడు ॥పల్లవి॥**

**పొద్దు వొద్దు హరిఁ దలఁపునఁ దలపోయఁగ**
**వొద్దికైనపలుచేఁత లున్న వెల్లా మరచును**
**నిద్దిరించువానిచేతినిమ్మపంటివలెనే**
**బుద్ధితోఁ గర్మములు గొబ్బున జారిపోవును ॥నేనై॥**

**పలుమారు గురుసేవఁ బరగఁగా బరగఁగా**
**చలివాసి యాత్మవిజ్ఞానముఁ బొడచూపు**
**కలగన్నవాఁడు మేలుకనిన కలవలెనే**
**పలుసంసారములెల్ల భావనలై యుండును. ॥నేనై॥**

**పక్కన శ్రీవేంకటేశుపై భక్తి వొడమఁగా**
**అక్కజపు టిహపరా లరచేతివి యౌను**
**చొక్కపు పరుసమంటి సొంపుగానిలోహము**
**నిక్కఁ బైఁడైనట్టు నెరుసెల్లఁ దొలఁగును ॥నేనై॥414**

**భావ దర్పణము :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తన నాభావదర్పణంలో నాకీ తీరుగా కనపడింది. నేనై హరిసేవ విడువవద్దు. తానై నాకర్మబంధము నాకు తగులవద్దు. ఎవరికి వారు హరి చింతనలో వుంటే ఈ తగులెల్లా (బంధాలన్నీ), వూడిపోతుంటాయి. అప్పుడుగాని శ్రీహరిపై ధ్యాస నిలువదు, ఏకాగ్రత లభించదు. ఏపొద్దునైనా హరిని తలపున తలపోయగా వాడు చేయాలనుకొన్న అనేకమైన పనులను మరచిపోతాడు. నిద్రించేవాని చేతిలోని నిమ్మపండు స్థిరంగా వుంటుందా? కర్మములన్నీ బుద్ధి చేతనే చేయబడతాయి కాబట్టి హరిధ్యాసలో మైమరచినవాని కర్మఫలములన్నీ గొబ్బున (శీఘ్రముగా) జారిపోవును. సద్గురుని సేవ చేయగా చేయగా ఆత్మలో విజ్ఞానము ఆనవాలు చిక్కునట్లుగా పొడచూపును. కలగని మేలుకొన్నవాడు కలలో జరిగిన వాటికి తనకూ ఏ సంబంధమూ లేదని ఎలా తెలిసికొంటాడో ఆ ఆత్మజ్ఞానికూడా, ఈ సంసారము (జగత్తు) అనిత్యమైనదని గ్రహించి అనురాగములేని భావనలోనే వుంటాడు. మానవునిలో కొన్ని కళంకములుండుట సహజమే. అయితే ఒకపక్క మానవునిగా జీవిస్తూనే శ్రీవేంకటేశ్వరునిపై భక్తిని అలవరచుకొనినవానికి, ఆశ్చర్యముగా ఇహపరములు రెండూ లభిస్తాయి. వీడి కళంకిత జీవితం ముక్తిదాయకం అవుతుంది. పరశువేదితో అంటుకొన్న సామాన్యలోహము బంగారం అయినట్లు పాపికూడా పుణ్యాత్ముడవుతాడు.

★ **నెరు(ర)సెల్లా** – కళంకమంతా ★ **చలివాసి** – ఆనవాలుచిక్కి





సంఖ్య : IV/390    రాగం : సామంతం    పుట: 262

**22 ఒకరిబుద్ధులు వేరొకరి పనికిరావు**
**అకలంకుఁ డింతటికి నంతర్యామి ॥పల్లవి॥**

**పొడమించు నాతఁడే పొదలించు నాతఁడే**
**నొడిగించు నాతఁడే నోరఁగొలఁది**
**గడియించు నాతఁడే కడలేని సిరులెల్ల**
**అడియాలమగులోనియంతర్యామి. ॥ఒకరి॥**

**మతి యిచ్చు నాతఁడే మరపించు నాతఁడే**
**గతియౌ నాతఁడే కరుణానిధి**
**వెతమాన్పు నాతఁడే వెలయించు నాతఁడే**
**అతిశయమగులోనియంతర్యామి ॥ఒకరి॥**

**యిహమిచ్చు నాతఁడే యెదురెదురనే వచ్చి**
**సహజపుఁ బరమిచ్చు సరి నాతఁడే**
**విహగగమనుఁడు శ్రీవేంకటేశుఁ డితఁడే**
**అహరహమాదరించు నంతర్యామి ॥ఒకరి॥390**

**భావ దర్పణము :**

'బుద్ధి' అంటే సత్ప్రవర్తన. అది యుగధర్మాన్నిబట్టి, సాంఘిక ధర్మాన్నిబట్టి, దేశకాల పరిస్థితులనుబట్టి మారుతుంది. అదే అన్నమయ్య ఈ కీర్తనలో నొక్కి వక్కాణిస్తున్నారు. ఒకరి బుద్ధులు వేరొకరికి పనికిరావు (ఆచరణీయ యోగ్యములు కావు). వీరందరికీ అకలంకుడు (ఏకళంకమూ లేనివాడు) ఒక్క అంతర్యామి మాత్రమే. ఇక ఆ అంతర్యామి, అడియాలమగువాడు (గుర్తించదగినవాడు). ఏవిధముగా నంటే... అతడే పొడమించును (పుట్టుక కలుగునట్లు చేయును). ఆతడే పొదలించును (పెనవేయునట్లు చేయును). ఆతడే నొడిగించును (మాట్లాడించును). అదీ నోటినిండా మాట్లిడిస్తాడు. అంతులేని సిరులను గడిస్తున్నదీ ఆతడే. దైహికంగా ఇవన్నీ మనిషి చేసినట్లున్నా అంతర్యామిలేని మనిషి శవమే కదా! అతిశయించుచు లోనుండి అంతర్యామి యెట్టివాడో వినండి. మనకు మతిని ఇచ్చేది ఆతడే. మరపునిచ్చేది కూడా ఆతడే. ఆతడు కరుణానిధి. మానవునికి గమ్యమును బోధించేవాడు ఆతడే. బాధను మరువలేనిదే మనిషి జీవించలేడు. మరి ఆ మరపించేవాడూ ఆతడే. మరచి మరల జీవనం కొనసాగించేవాడూ ఆతడే. మరి ఆ అంతర్యామిలేని జీవి మనుగడ సాగించగలడా? ఇహలోకంలో అన్నీ ఇచ్చునది ఆతడే. నిత్యమూ మనకు ఎదురవుతూ పరముకోసం కృషిచేయించేదీ ఆతడే. రేయింబవళ్ళు మనని ఆదరించే అంతర్యామి యెవరని అనుకొంటున్నారు? విహగగమనుడు (గరుత్మంతుడు) వాహనముగాగల శ్రీవేంకటేశ్వరుడే.

★ **వెతమాన్పు**- బాధను మరపించును ★ **అహరహము** - రేయింబవళ్ళు

సంఖ్య : III/258 రాగం : పాడి పుట: 174

**23 శిష్టరక్షణమును దుష్టనిగ్రహమును**
**సృష్టించె నొక్కవేళనే శ్రీజయంతినాఁడు.** ॥పల్లవి॥

**హరి కృష్ణావతార మందినయంతలోనే**
**పరమమునులకెల్ల భయముడిగెను**
**తెరలి దైత్యులగుండె దిగులుచొచ్చె నత్తరి**
**సిరులమించినయట్టి శ్రీజయంతినాఁడు.** ॥శిష్ట॥

**గోవిందుఁడు వసుదేవుకొడుకైనయప్పుడే**
**గోవులు రంకెలువేసె గొల్లపల్లెను**
**నోవితోడఁ గంసునికి నూరునిండెఁ జూడఁగానె**
**చేవలుమీరినయట్టి శ్రీజయంతినాఁడు.** ॥శిష్ట॥

**నారాయణుఁడు భువి నరుఁడు దాఁ గాఁగానే**
**మేరఁ బాండవు లెచ్చిరి మేనవావిని**
**కౌరవులపని దీరె కమ్మి శ్రీవేంకటేశుఁడు**
**చేరువనే మెరయఁగ శ్రీజయంతినాఁడు.** ॥శిష్ట॥**258**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ కీర్తనలో శ్రీజయంతి (శ్రీకృష్ణజయంతి) యొక్క వైభవాన్ని వర్ణిస్తున్నారు. ఈ శ్రీజయంతినాడు ఒకే సమయంలో ఆ దేవదేవుడైన శ్రీకృష్ణుడు శిష్టరక్షనము (సుజనులను కాపాడుట) దుష్టనిగ్రహము (దుర్జనులను రాపాడుట) సృష్టించెన్ (వెలువరించినాడు). ధర్మసంస్థాపనకు అవతరించిన శ్రీమన్నారాయణుడు శ్రీహరి, కృష్ణావతారమును అందినంతనే, మహామునులు అందరికీ భయముతీరిపోయినది. విజృంభిస్తున్న దైత్యులందరికి అత్తరి (ఆ సమయమున) గుండెలు దిగులు చెందినవి. ఆ శ్రీజయంతినాడు సిరులు అతిశయించినవి. గోవిందుడగుటకు శ్రీమహావిష్ణువు వసుదేవుని కుమారుడై మధురానగర చెరసాలలో జన్మించాడు. అప్పుడే గోకులంలోని గోవులన్నీ ఆనందంతో 'రంకె' వేసినవి. వేదన చెందిన కంసునికి కృష్ణుని జూడగానే నూరునిండెను (ఆయువు తీరినది). అతిశయించిన శ్రీకృష్ణ జయంతి జనులను అలరించినది. శ్రీమన్నారాయణుడు, భూమిపై నరునిగా దాగాగానే (తాను అవతరించగానే) పాండవులుగా (యముడు, వాయుదేవుడు, ఇంద్రుడు, అశ్వనీదేవతలు మహేంద్రుని అంశతో ఐదుగురుగా జన్మించిరి). వీరందరు మేనరికమున జన్మించిరి. శ్రీవేంకటేశ్వరుని మాయ కమ్మిన దుర్జనులంతా కౌరవులై జన్మించి పాండవులపై పగబూనిరి. ఆ శ్రీవేంకటపతి సమీపముననే వెలసి కలియుగమున శ్రీజయంతి వైభవముతో నిర్వహించినాడు.

★ **నోవితోడ** - వేదనతో ★ **మేనవావిని** - మేనరికముతో





సంఖ్య : IV/394 రాగం : శుద్ధవసంతం పుట: 264

**24** ఏమని చెప్పెద నిటమీఁద హరీ
**శ్రీమంతుఁడ నిమఁ జేరితి మిదివో** ॥పల్లవి॥

**వినుచున్నారము వెనకటిపాట్లు**
**కనుచున్నారము కలఁగేటివారల**
**దినదినభావము తెలిసీఁ దెలియదు**
**మనసున భయ మిసుమంతయు లేదు** ॥ఏమని॥

**భువి నెరుఁగుదు మిదె పుట్టెడిదెసలను**
**తవిలి మరణములు దలఁచెద మట్లనె**
**వివరపుటాసలు విడిచీ విడువవు**
**నవమగువిరక్తి నాఁటదు వోయె (?)** ॥ఏమని॥

**చదివెద మిదివో సకలశాస్త్రములు**
**వెదకెద మిదె శ్రీవేంకటేశ నిను**
**మదిలోనుండఁగ మరచివుంటి మిదె**
**యెదుటఁగంటి మిఁక యేలాపనులు** ॥ఏమని॥**394**

**భావ దర్పణము :**

నిలువెత్తు శ్రీవేంకటేశ్వరుని సందర్శించిన మైమరపులో ఆ అర్చావతారాన్ని చూస్తూ పులకరించిన అన్నమయ్య నోటినుండి వెలువడిన కీర్తన ఇది. ఓ శ్రీహరీ! ఇంకా ఇటుపైన ఏమని చెప్పెదనయ్యా? నీవు శ్రీమంతుడవు. మేము నీ భృత్యులము. ఇదివో నీ ఆశ్రయంలో చేరితిమి. మాకు సర్వస్వమూ నీవే. అన్యమేదీలేదు. మేము మాచుట్టూ జన్మంతరమున చేసిన యేయే పాపములకు మరు జన్మలలో యేవిధముగా ఆ కర్మఫలము అనుభవించవలసివుంటుందో వినుచున్నారము. అట్లు ఆ పాపఫలము కలిగినవారలను కొందరిని కనుచున్నారము కూడా. అయితే జీవభ్రాంతివలన, దినదిన భావము తెలిసియూ తెలియనివారివలె ప్రవర్తించుచున్నాము. మనస్సున కొంచెమైనను జంకు గొంకు నెరుగకున్నాము. ఉన్నతమైన జన్మపొందినవారు హేయమైన మరణము బొందుట గమనించితిమి. దూషించదగిన ఆశలతో వారు చేసిన దుష్కార్యములను గురించి విని అట్టివి మేము వెంటనే విడిచిపెట్టాలని అనుకొంటాము. కాని అదేమి చిత్రమో ఆ ఆశలు మమ్ములను విడువవు. మాకు కొత్తజీవితం ప్రసాదించగల "విరక్తి" నాటుకొనదు. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవిచ్చిన శ్రేష్ఠమైన జన్మవలన సకల శాస్త్రములను చదివితిమి. అందువలన నిన్ను వెదకి కనుగొన ప్రయత్నించుచున్నాము. కాని నీవు మా మదిలోనే అంతర్యామివని మఱచితిమి. ఇదిగో నేడు మా ఎదుటనే నిన్ను కనుగొంటిమి. ఇక మాకు ప్రాపంచిక విషయములేల?

★ **వివరపుటాసలు**-దూషించదగినఆశలు ★ **మదిలోనుండగ**-మాఅంతర్యామివని

సంఖ్య : IV/395 రాగం : లలిత పుట: 265

**25 ఆచారవిచారా లవియు నే నెరఁగ**
**వాచామగోచరపువరదుఁడ (వు) నీవు** ॥పల్లవి॥

**తపమొక్కటే నాకుఁ దగునీశరణనుట**
**జపమొక్కటే నిన్ను సారెకు నుతించుట**
**వుపమొక్కటే నీవె వున్నతుఁడవంట**
**విపరీతవిజ్ఞానవిధులేమి నెరఁగ** ॥ఆచా॥

**కర్మమొక్కటే నీ కైంకర్యగతి నాకు**
**ధర్మమొక్కటే నీ దాసానుదాస్యము**
**మర్మమొక్కటే నామతి నిన్నుఁ దలఁచుట**
**అర్మిలి నింతకంటే నవల నే నెరఁగ.** ॥ఆచా॥

**బలిమియొక్కటే నాకు భక్తి నీపైఁ గలుగుట**
**కలిమియొక్కటే నీవు గలవని నమ్ముట**
**యెలమితో శ్రీవేంకటేశ నీవు గతిదక్క**
**పలుబుద్ధుల నేఁబొరలు భావనలేనెరఁగ** ॥ఆచా॥**395**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ కీర్తనలో శ్రీవేంకటేశ్వరుని వాక్కునకు గాని, కనులకుగాని గోచరము కాని వరదుడవు అని కీర్తిస్తున్నారు. పోనీ నేనేమన్నా నిష్ణాతుడనా అంటే ఆచారముగాని ఆలోచనగాని లేనివాడను. అవంటే యేమో యెరుగని వాడను నేను, అని అంటున్నారు. స్వామీ! నాకు తగిన తపస్సు యేదో చెప్పమంటావా? నీ శరణాగతియే. నాకు తగిన జపము నిత్యము నిన్ను నుతించుటే. నీవే ఉన్నతుడవని కీర్తించుటే నేనెరిగిన చక్కని ఉపమ (ఉపాయము). ఇందుకు విరుద్ధమైన విజ్ఞాన విధులేవీ నేనెఱుంగను. ప్రభూ! వేదవిహితమైన కర్మలేవీ నేనెఱుంగను. నీ కైంకర్యమే నాకు గతి. ధర్మము గురించి యేవేవో చెబుతున్నారు. నేనెరిగిన ధర్మమొక్కటే. అదీ నీదాసులను దాసుడిగా కొలుచుటే నాకు తెలిసిన ధర్మము. నాకు ఏమర్మము తెలియదు. కాని నామదిలో నిన్ను తలచుటే నాకు తెలిసిన మర్మము. ఆపేక్షతో నిన్ను ధ్యానించుటకంటే అన్యమేదీ నేనెఱుంగను. నేను బలవంతుడనుగాను. కాని నాకున్న బలమంతా నీపై కలిగిన భక్తి ఒక్కటే. నాకున్న కలిమి కూడా నీవు కలవు అనే నమ్మకమే. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు తప్ప నాకు మరొకదిక్కు లేదయ్యా! అనేకమైన బుద్ధులతో వేర్వేరు దేవతలను ఆరాధించు భావనలే నేనెఱుంగను.

★ **ఆర్మిలి** – ఆపేక్ష ★ **ఎలమి** – సంతోషము





సంఖ్య : IV/398 రాగం : లలిత పుట: 266

**26 పనిలే దేమియు నాకు పంపుడు నీబంట నింతే**
**యెనపినతెడ్డు చౌ లెరుఁగునటవయ్యా** ॥పల్లవి॥

**మనసు నీ విచ్చితివి మాఁటలు నీ విచ్చితివి**
**తనువు నీ విచ్చితివి యంతర్యామీ**
**చెనసి నీదువల్ల జేసేకర్మపు (ఁ?) బంట**
**నినుపుఁగణఁజాల నించుకొనవయ్యా** ॥పని॥

**సత్తువ నీ విచ్చితివి చలము నీ విచ్చితివి**
**తత్తర మిచ్చితివి యంతర్యామి**
**యిత్తల నావల నీవు యెందుకైనఁ బెరరేఁచి**
**యెత్తుక యేమైన గడియించుకొనవయ్యా** ॥పని॥

**మాయలు నీ విచ్చితివి మదము నీ విచ్చితివి**
**ఆయపుశ్రీవేంకటాద్రియంతర్యామి**
**యేయెడ నేఁ జేసేటి యిన్నెపరాధాలు**
**వేయమిన నీవెనక వేసుకొనవయ్యా** ॥పని॥ **396**

**భావ దర్పణము :**

అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుడే తన అంతర్యామి అని తెలిసిన వారై స్వామీ! నేను నీ బంటునయ్యా! నాకు వేరేయే పనియులేదు. నీవెక్కడికి పంపిస్తే అక్కడికి పోతాను (ఎక్కడ యే జన్మనిచ్చి పొమ్మంటే అక్కడికి పోతాను). వంటలో కలియబెట్టుటకు వాడే కొయ్యతెడ్డుకు అది కలియబెట్టే పదార్థం “రుచి” తెలుస్తుందా స్వామీ! నీ వైభవాన్ని వర్ణిస్తున్నంతమాత్రాన నాకు నీ మహిమ తెలుస్తుందా? ఓ నా అంతర్యామీ! నా తనువు నీవిచ్చినదే, నామనస్సూ నీవిచ్చినదే, నాకు మాట కూడా నీవిచ్చినదే. ఇక నన్ను చూడబోతే చెనసి (యెదిరించి) నీవు చెప్పిన కర్మనాచరించడానికి నీవిచ్చే ఫలాన్ని స్వీకరించే బంటుని నేను. నిన్ను చక్కగా అంచనా వేయలేని అసమర్థుడను. నన్ను నించుకొనవయ్యా (నీలో చేర్చుకోవయ్యా!) ప్రభూ! నా సత్తువ నీవిచ్చినదే. నా పట్టుదలా నీవిచ్చినదే. నా తడబాటూ నీవిచ్చినదే. నా అంతర్యామివై నీవిచ్చిన ప్రేరణవల్లనే ఇహలోకములో యీ గుణములు పరలోకంలో కూడా ఎందుకు అలాగే వుంటాయో తెలియదు. నీ ఎత్తుక (కోరిక) తీరా నీకేదితోస్తే అది చేయవయ్యా! స్వామీ! పరులను మాయచేసే తెలివితేటలు నీవిచ్చినవే. నా సమర్థతవల్ల కలిగిన “మదమూ” నీవిచ్చిన గుణమే. నీవే శ్రీవేంకటాద్రిపై వెలసిన అంతర్యామివి. ఏనాడైనా, నా అపరాధాలు వెయ్యిదాటినా ఇన్ని అపరాధాలను నీ వెనక వేసికొనవయ్యా! నేనెంత, నా బ్రతుకెంత? కనికరించి ఆదుకోవయ్యా! అంతర్యామీ!

★ **పెరరేచితివి** – ప్రేరేపించితివి ★ **యెనపిన** – కలియబెట్టిన

సంఖ్య : IV/400    రాగం : తెలుగుగాంబోది    పుట: 268

**27 తెగఁగోయుటకు హరి దివ్యనామకీర్తనము**
**వెగటునాయుధ మిది విడువకుమీ మనసా** ॥పల్లవి॥

**భవపాశములచేతఁ బట్టువడ్డదేహికి**
**యివలఁ గర్మపాశాలు యివియుఁ గొన్నే**
**తవిలె నాశాపాశతతులవి యొకకొన్ని**
**కవగూడఁ దవిలెను కామపాశములు** ॥తెగ॥

**పమ్మి లోకపుఋణానుబంధపు జీవికి**
**యిమ్ముల సంసారబంధా లివియుఁ గొన్నే**
**కమ్మరఁ బుణ్యపాపకలుషబంధాలు గొన్ని**
**సమ్మతించ భోగములే సకలబంధములు** ॥తెగ॥

**శ్రీవేంకటేశ్వరుఁడు చిత్తములో నున్నవాఁడు**
**జీవుఁడు నాతనిలోనే చేకొని పాయఁడు వీఁడె**
**భావించి కొలిచిన పాయును మాయలన్ని**
**దేవుఁ డితనినమ్మిన తీరుఁబో దుఃఖములు** ॥తెగ॥**400**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ కీర్తనలో మనస్సును ఇలా హెచ్చరిస్తున్నారు. నీ భవబంధాలను, పాపపుణ్యఫలముచేత కలుషితమయ్యే బంధాలను వదిలించుకోవాలంటే దివ్యమైన హరినామ సంకీర్తన తప్పించి మరొక దారిలేదు. ఆ బంధాలను తెగగోయాలంటే ఘోరమైన ఆయుధము ఇదే. దీనిని విడువవద్దు. భవపాశము (జన్మబంధాలు) చేతకట్టబడ్డ దేహికి, కొన్ని కర్మపాశాలు కూడా జతపడతాయి. ఆశాపాశములయొక్క సమూహములు కొన్ని అదేవిధంగా జతపడతాయి. వీటి ఫలితమా అన్నట్లు కవగూడి (జతగూడి) కామపాశము తగులుకొంటుంది. ఇదొక్కటే చాలు దేహిని భ్రష్టుని చేయటానికి. జీవికి లోకంలో ఋణానుబంధం రకరకాలుగా వుంటుంది. సంసారబంధాలు అట్టివాటిలో కొన్ని. జీవికి పాపపుణ్యాలు చేయటం సహజమే. ఆ పాపపుణ్యములు, మరికొన్ని కలుషితమైన బంధాలను కలిగిస్తాయి. జీవి ఏనాడైతే భోగములకు సమ్మతిస్తాడో అన్ని బంధాలూ యేర్పడతాయి. శ్రీవేంకటేశ్వరుడు యెల్లప్పుడూ చిత్తములోనే వుంటాడు. జీవుడు ఆయనను ఆశ్రయించియే వుంటాడు. ఈ మాయ వలన జీవికి అరిషడ్వర్గములు పీడిస్తుంటాయి. ఈమాయ తిరుమలేశుని కొలిచిన వారిని పీడించదు. దేవుడైన ఆయనను నమ్మి కొలిచిన దుఃఖములన్నీ తీరును.

★ **కమ్మర** – మరల ★ **వెగటున**– విరసత్వముగల





సంఖ్య : III/429    రాగం : కన్నడగౌళ    పుట: 289

**28 నడపే వేఁటికి నాటకము**
**అదరి నిజముగా నానతి యీవే.** ॥పల్లవి॥

**విశ్వమూర్తికొక విన్నపము**
**శాశ్వతములాయ జగములివి**
**యీశ్వరేశ్వరున కింకొకవిన్నపము**
**ఐశ్వర్యమోక్షం బాత్మలకేది.** ॥నడ॥

**రమాధిపతి కొకరహస్యము**
**సమానుఁడవు నీవు సర్వమున**
**క్రమాన నిఁక నొకరహస్యము**
**సమో హి (?) నరకము స్వర్గము నేలా.** ॥నడ॥

**హరి నే నొకమాఁ టడిగెదను**
**నిరంతరాత్మవు నీవుగదే**
**యిరవుగ శ్రీవేంకటేశ నేనడిగెద**
**విరసము లే దిఁక విచార మేలా.** ॥నడ॥ **429**

**భావ దర్పణము :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో భావము ద్రాక్షాపాకములో వున్నట్లనిపించే భ్రమ అని నా అభిప్రాయము. ఈ జీవన్నాటకములో "కష్టాలు, సుఖాలు, దుఃఖాలు, భ్రాంతులు"– ఇవన్నీ దేనికి పెట్టావయ్యా? అని అడుగుతున్నారు. నీ నిజమైన వుద్దేశ్యమేమిటో మాకు సెలవీయరాదా? దీనివల్ల నీకు వొరుగుతున్నదేమిటయ్యా? ఓ విశ్వమూర్తీ! నీకొక విన్నపము చేస్తున్నానయ్యా! ఈ జగములన్నీ నీ నియమాలను పాటిస్తూ, శాశ్వతము అనే భ్రాంతిని కలిగిస్తున్నాయి. ఈశ్వరుల కీశ్వరుడవైన సర్వేశ్వరా! నీకింకొక విన్నపము. మా ఆత్మలు నీ అధీనములు. అటువంటప్పుడు వాటికి 'మోక్షము' అనె ఐశ్వర్యం ఎట్లా లభిస్తుంది? ఓ రమాధినాయకా! నేనొక రహస్యము తెలిసికొన్నాను. సర్వమూ నీకు సమానమే. బాగుబాగు. అటువంటప్పుడు స్వర్గము, నరకము, నేల (మనుష్య లోకము) లెందుకు. కొందరికి సుఖించే లోకాలు, కొందరికి దుఃఖించే లోకాలు, కొందరికి రెండూ సమ్మిళితమైన భూలోకం యెందుకు వుండమని ఇస్తున్నావు? "సమోహి"తో యెట్లా నమ్మమంటావు? ఓ శ్రీహరీ! నిన్నొకమాట అడిగెదనయ్యా! నీవు నిరంతరమూ మా ఆత్మలలో అంతర్యామిగా వుంటావు కదా! నీవే శ్రీవేంకటేశ్వరుడవు మా అందరికీ కొంగుబంగారము వంటివాడవు. నీకు నీ భక్తులపై విరసభావనేరాదు కదా! మరి నీశరణాగతుడనైన నాకు విచారమెందుకయ్యా?

★ **అదరి** – అతిశయించి ★ **విరసము** – విరుద్ధ భావన

సంఖ్య : III/427 రాగం : కేదారగౌళ పుట: 287

**29** ఎన్ని చందముల నెట్టిన నుతింతు
కన్నుల నిన్నే కనుఁగొంటిఁగాన ॥పల్లవి॥

గోవిందాయని కొలిచిననిన్నే
శ్రీవల్లభుఁడని చింతింతును
భూవిభుఁడవు యిది పునరుక్తనకుమీ
దైవ మొకఁడవే ధరణికిఁగాన. ॥ఎన్ని॥

పరమాత్ముఁడవని భక్తిసేసి నిను
నరహరివని ధ్యానముసేతు
సరవులఁ జర్వితచర్వణమనకుమీ
అరయఁగ గురి యంతరాత్మవుగాన. ॥ఎన్ని॥

సరుగ శ్రీవేంకటేశ్వర నీదాస్యము
మరిగితి నదె ముమ్మాఁటికిని
తిరిగినయందే తిరిగెదననకుమీ
యిరవుగ నితరం బిఁకలేదుగాన. ॥ఎన్ని॥ **427**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ కీర్తనలో పరమాత్ముడైన గోవిందుని ఎన్ని విధములుగానైనా ఎటులనైనా నుతింతును అని వేడుకొంటున్నారు. ఎందుకని అంటే ఆయన కన్నులయెదుట శ్రీవేంకటేశ్వరుడు సాకారముగా కనుపించినాడు. అన్నమయ్య తన అదృష్టానికి మురిసిపోతున్నారు. ప్రభూ! గోవిందా!యని కొలిచిన నిన్నే శ్రీపతి అని చింతింతును. నీవు భూవల్లభుడవు కదా! ఇది పునరుక్తి (చెప్పినదే మళ్ళీ చెప్పుట) అని నాపై నెపం వేయకుమయ్యా! ఈ భూమిమీద నువ్వొక్కడవే ప్రత్యక్షదైవమువు. అందుకేమరి దేవా! పరమాత్ముడవని భక్తితో నిన్ను గొలిచెదను. నరహరివి అని కీర్తించి నీకు దాస్యము చేసెదను. క్రమముగా చర్వితచరణము (చెప్పినదే మళ్ళీ చెప్పుట) అని దెప్పిపొడవవద్దు స్వామీ! నిజము ఆలోచించి చూస్తే మా అంతరాత్మవు నీవే కదా! వర్ధిల్లునట్టి శ్రీవేంకటేశ్వరా! నేను ముమ్మాటికి నీ దాస్యము గతియైన వాడనుట నిక్కము. ఒరే! నీవు తిరిగిన చోటనే తిరుగుతున్నావురా అని దెప్పి పొడవవద్దు స్వామీ! నేనట్లా యెందుకు తిరుగుతున్నానంటే, నాకింకొక దారి లేదు తండ్రీ!

★ **సరవుల** – క్రమముగా ★ **సరుగు** – వర్ధిల్లు





సంఖ్య : III/262 రాగం : హిందోళవసంతం పుట: 177

**30** ఎన్నికై శ్రీవేంకటేశుఁ డితడు గలుగఁగానె
అన్నిటా నందరిలోని అజ్ఞానాలుఁ బాసెను. ॥పల్లవి॥

సకలశాస్త్రములందు సందేహమే కాని
వొకరు దైవమహిమ కొడఁబడరు
అకటా బాసచేసినయందుకైనా నమ్మరు
వికలచిత్తులెల్లాను విష్ణుదాస్యమునకు. ॥ఎన్ని॥

గక్కనఁ గర్మము చేసి కడునలయుటేకాని
వొక్కమాటు హరిఁ బాడ నొడఁబడరు
తక్కక పెద్దలుగాఁగ తలవణఁకుటేకాని
పుక్కిటికాండ్లు హరిఁ బూజించనేరరు. ॥ఎన్ని॥

చిత్తములో వివేకించి చింతఁ బొరలుటేకాని
వొత్తి హరిపై భార మొప్పగించరు
హత్తిన శ్రీవేంకటేశుఁ డటె దయదలచఁగా
మత్తిలి ప్రపన్నులెల్లా మరేమిటాఁ దప్పరు. ॥ఎన్ని॥ **262**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఒక అద్భుత సత్యాన్ని ఆవిష్కరిస్తున్నారు. ఏనాడైతే మనం శ్రీవేంకటేశ్వరుని, నాకితడు కలడనుకొనగానే, అందరిలోనూ అన్ని విధములైన అజ్ఞానములు బాసెను (తొలగిపోయాయి) అంటున్నారు. ఇక తదుపరి అంకం, సర్వం ఆ స్వామే అనే జ్ఞానం కలగటమే. శాస్త్రములనన్నింటినీ చదివితే సందేహాలు యెక్కువైతాయేగాని, తగ్గవు. వాడికి తర్కం "ఎక్కువై" దైవమహిమకు ఒడబడని దశకు చేరుకొంటాడు. అక్కటా! (అయ్యో!) దైవంపై ఒట్టుపెట్టడాన్నికూడా నమ్మరు. ఇక విష్ణుని దాస్యమేమిచేస్తారు. వారి మనస్సు వికలమై అందుకంగీకరించరు. మరి శాస్త్రాలు వారికి మేలుచేసినట్లా? కీడుచేసినట్లా? యజ్ఞాలూ, యాగాలు అని యేవేవో "కర్మలు" చేస్తారు. దానివల్ల ధనవ్యయం, శారీరక శ్రమ తప్ప, ఒక్క మాటు అయినా హరిని నుతించి "పాడరు" కదా! అటువంటి కర్మిష్టులకు వృద్ధాప్యం వచ్చి తలవణుకుతుందే కాని ఆ వ్యర్థులు హరిని పూజించే బాటనెన్నుకోరు. ఈ "వివేకవంతులు" ప్రతిదీ తమ చిత్తములో వివేకించి దీనికి కారణం ప్రకృతి. దీనికి కారణం కంటికి కలిగే భ్రమ (ఇల్యూజన్) అని తీర్మానిస్తారు. అట్టివారు శ్రీహరిపై భారం వేయలేరు. అట్టివారిపై కూడా శ్రీవేంకటేశ్వరునికి దయకలిగిందంటే వారే ప్రపన్నులవుతారు. స్వామీ! శరణు శరణు అంటారు. ఇక వారు దారి తప్పరు. (ఈ రచయితే దీనికి ఒక ప్రత్యక్ష సాక్షి. నన్ను నమ్మండి.)

★ **పుక్కిటికాండ్లు** – వ్యర్థులు ★ **హత్తిన** – పొందికగల

సంఖ్య : III/425 రాగం : లలిత పుట: 286

**31** **ఇన్నిటా శ్రీహరిభక్తి యిది లాభము**
**పన్నినతపముచేత బడలుటే లాభము. ॥పల్లవి॥**

**యెనయఁ గర్మదేహ మిదెన్ని పాట్లు వచ్చినా**
**ననుభవించి తీరుచు టది లాభము**
**తన పాపవర్తన యితరు లెంత నిందించినా**
**ననుమానించక పడుటది లాభము. ॥ఇన్ని॥**

**తగుసంసారజీవుఁడు తన్నెంత వేసరించినా**
**నగి రుణము దీర్చుట నానాలాభము**
**చిగురువంటి చిత్తము చేరి యెందు దిప్పినాను**
**తగిలి యలయుటే దక్కినట్టిలాభము. ॥ఇన్ని॥**

**శ్రీవేంకటేశ్వరుఁడు జీవములో నుండఁగాను**
**యేవేళ నెట్లయినా నివి లాభము**
**పావనమైనట్టియాత్మ భావమెంత మఱచినా**
**ఆవల నానందించు టది లాభము. ॥ఇన్ని॥ 425**

**భావ దర్పణము :**

మానవజీవితంలో అతనికి ప్రయోజనం కలిగించేవాటిని లాభముగా పేర్కొంటారు. అన్నమయ్య ఈ కీర్తనలో, ఇన్నిటా (అన్ని విధముల) శ్రీహరిభక్తి లాభము (ప్రయోజనకరము), అతిశయించిన తపమునాచరించుచూ, అతనిని బడయుట (పొందుట) లాభము అంటున్నారు. పురాకృత కర్మచే లభించిన ఈ దేహముతో ఎన్నిపాట్లు వచ్చినా అనుభవించక తప్పదు. అట్లా అనుభవించి ఆ కర్మఫలము తీర్చుకొనుటయే లాభము. తన పాపపు నడవడిని ఇతరులు నిందిస్తున్నారని అవమానం పొందినా అదియే లాభము. నీ పాపమును వారు పంచుకొనుచున్నారన్నమాట అది నీకే లాభము. ఈ సంసారము జీవుని ఎంతో వేసరిస్తుంది (పీడిస్తుంది). అయినా నవ్వుతూ ఋణము తీర్చికొనుట అనేకవిధముల లాభకరము. మానవుని చిత్తము చిగురువంటిది. అది అతనిని యెక్కడెక్కడో తిప్పుతుంది. అదెట్లా తిప్పినా, తగిలి అలయుటే మంచిది. అదే ఆ జీవికి దక్కినట్టి లాభము. జీవముతోనుండగా యేవేళ శ్రీవేంకటేశుని తెలిసికొనినా, యెట్లా తెలిసికొనినా అది ఆ జీవికి యెంతో లాభకరము. నీవు పావనమైన ఆత్మవను భావము ఆనందహేతువగును. అనిత్యమైన దేహము గురించి దిగులు చెందక, మధ్యలో కొంత మరచినా ఆనందంతో వుండుటయే లాభము.

★ **చిగురువంటిది** – కోమలమైనది ★ **పన్నిన** – అతిశయించిన





సంఖ్య : III/358 రాగం : దేసాళం పుట: 281

**32** **ఆతఁడే బ్రహ్మణ్యదైవ మాదిమూలమైనవాఁడు**
**ఆతని మానుటలెల్లా నవిధిపూర్వకము. ॥పల్లవి॥**

**యెవ్వనిపేరఁ బిలుతు రిలఁ బుట్టినజీవుల**
**నవ్వుచు మాసనక్షత్రనామములను**
**అవ్వల నెవ్వనికేశవాదినామములే**
**రవ్వగా నాచమనాలు రచియింతురు. ॥ఆతఁ॥**

**అచ్చు మేదేవుని నారాయణనామమే గతి**
**చచ్చేటి వారికి సన్యాసము వారికి**
**ఇచ్చు నెవ్వరిఁ దలఁచి యిత్తురు పితాళ్లకు**
**ముచ్చట నెవ్వని నామములనే సంకల్పము ॥ఆతఁ॥**

**నారదుఁడుదలఁచేటినామ మది యెవ్వనిది**
**గౌరినుడిగేటినామకథ యేడది**
**తారకమై బ్రహ్మరుద్రతతి కెవ్వరినామము**
**యీరీతి శ్రీవేంకటాద్రి నెవ్వఁడిచ్చీ వరము ॥ఆతఁ॥ 358**

**భావ దర్పణము :**

బ్రహ్మణ్యదైవము అంటే పరబ్రహ్మస్వరూపుడైన దైవమని అర్థం. అన్నమయ్య ఈ కీర్తనలో ఆ శ్రీవేంకటేశ్వరుడే పరబ్రహ్మస్వరూపుడు, మూలకారణములకెల్ల "ఆది" అయినవాడు. ఆతని విముఖులైనవారు, కొలుచుట మానినవారు అందరు అవిధిపూర్వకము (కర్తవ్య విముఖులే). అంతెందుకు, ప్రపంచంలో పుట్టిన జీవులను యెవ్వనిపేరుతో పిలుస్తున్నాము? మాసము, నక్షత్రములననుసరించి పేర్లను నిర్ణయిస్తాము కదా! మరి అవి యెవరి పేర్లనుకొన్నారు? సంకల్పము చెప్పుకోవాలంటే "ఓం కేశవాయస్వాహ"... అంటూ నామాలు చదివి ఆచమనం చేస్తామే... అవి యెవరి పేర్లు? ఏ దేవునికి జీవితాంతం సేవచేసినా, చివరికి నారాయణ నామమే గతి అవుతుంది. అంతిమయాత్రలో "నారాయణ" అని తీరాలి. సన్యాసికైనా నామోచ్చరణే గతి. పితృదేవతలకు యేది అర్పించాలన్నా మొదట సంకల్పములో యెవ్వరిపేరు స్మరిస్తామో ఆలోచించండి. నారదమహర్షి సదా ఊతపదముగా పలికేది "నారాయణ" నామమే. పార్వతీదేవి సదా జపించేది శ్రీహరినామమే. ఆయన గాథలనే ఆమెవిటుంటుంది. బ్రహ్మ, పరమేశ్వరుడు జపించే తారకనామము యెవ్వరిది? అవన్నీ అటుంచండి. నేటి కలియుగలంలో కలిదోషహరణ గావించి, కోరిన వరములు పొందాలంటే యెవ్వరి నామము గతి అవుతున్నది? నారాయణుని కలియుగ రూపమైన శ్రీవేంకటేశ్వరునిదే.

★ **పితాళ్ళకు** – పితృదేవతలకు ★ **నుడిగేటి** – చెప్పుకొనునది

సంఖ్య : III/423 రాగం : మంగళకౌశిక పుట: 285

**33** నేమెంత మూఢులమైనా నీలవర్ణుఁ డంతరాత్మ
మామనసు వెలితేల మంచిదౌఁగాక. ॥పల్లవి॥

దైవముకృప గలిగితే తనకర్మా లడ్డమా
ఆవేళ ఘనపుణ్యుఁడౌఁగాక
గోవిందుఁడు మన్నించితేఁ గొంచము దొడ్డున్నదా
కోవరపుసిరు లంది కొనకెక్కుఁగాక. ॥నేమెం॥

పరమాత్ముఁ డేలుకొంటే బంధములు గలవా
తెరదీసినట్లానె తెగుఁగాక
హరి విజ్ఞానమిచ్చితే నడ్డము మాయలుండునా
తొరలి జీవుఁడు మాయఁ దొలఁగుఁగాక. ॥నేమెం॥

శ్రీవేంకటేశ్వరురూపు చిత్తములోఁ జిక్కితేను
చావుఁబుట్టుగు లున్నవా జయమౌఁగాక
కైవల్య మీతఁడిచ్చితేఁ గడమలు గలవా
కేవలపుజగమెల్లా గెలుపించుఁగాక. ॥నేమెం॥ **423**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ కీర్తనలో యేమంటున్నారో వినండి. నేమెంత మూఢులమైన (మేమెంత మూర్ఖ శిఖామణులమైనా) మా అంతరాత్ముడు కూడా నీలవర్ణుడైన శ్రీహరియే. మా మనస్సున వెలితేమున్నది? అది మంచిదే అని నా నమ్మకం. ఆ దేవునికే మాపై కృపగలిగితే మా కర్మములు ఒక అడ్డమా? ఇదే వేళలో నేను గొప్ప పుణ్యాత్ముడనైపోనా? గోవిందుడే నన్ను మన్నించితే కొంచెము, అధికము అనే తేడా వుంటుందా? అంతులేని సిరిసంపదలు కలిగి అగ్రగణ్యుడనుకానా? తప్పకుండా అవుతాను. పరమాత్ముడే నన్ను ఆదరించి, యేలుకొంటే నాకు బంధములు వుంటాయా? తెరదీసినట్లు ఆ బంధములు తెగిపోవా? శ్రీహరి మంచి జ్ఞానం ఒసగువాడు. ఆయన ఇచ్చిన జ్ఞానం తోడుంటే మాయలుండుట జరిగేపనియేనా? జీవుని ఆవరించిన మాయ ఆ శ్రీహరికృప వుంటే తొలగి పోతుంది. శ్రీవేంకటేశ్వరుని రూపం చిత్తములో చిక్కితే (నిలిచిపోతే) జనన మరణాలు యే ఇబ్బందిని పెట్టవు. వారికి జయమే సిద్ధిస్తుంది. ఆ శ్రీవేంకటేశ్వరుడే కైవల్యం ప్రసాదిస్తే కొరత యేముంటుంది? జగమెల్లా గెలిపించడా?

★ **తొరలి** – కలిగి ★ **కడములు** – కొరతలు





సంఖ్య : III/413 రాగం : ముఖారి పుట: 278

**34** విష్ణుఁడ వచ్యుతుఁడవు విశ్వపరిపూర్ణుఁ డని
వైష్ణవు లానతియ్యఁగా వట్టిచదువులేల. ॥పల్లవి॥

వెన్న చేతఁబట్టి నేయి వెదకఁగ నిఁకనేల
నిన్ను లోన నించుకొని నిజమేదో యననేల
వున్నతి దీపమువట్టి వొగి నూతఁబడనేల
పన్ని నీదాస్యము గల్గ బహుకర్మమేల. ॥విష్ణుఁ॥

చాలాధనము గల్గి సంతలఁ దిరియనేల
నాలుక నీపేరు గల్గ నానాజపములేల
కాలము నేరు గుడిచి కాలువ వొగడ నేల
పాలించ నీవుడఁగాను పరచింతలేల. ॥విష్ణుఁ॥

మిన్ను చూచేయందుకుఁగా మిక్కిలి తోదోపులేల
అన్నిటా నీవుండఁగాను అడుగనేల
యెన్నఁగ శ్రీవేంకటేశ యిందరి నేలేవు నీవే
నిన్నే కొలుచుటగాక నీటుగర్వాలేల. ॥విష్ణుఁ॥ **413**

**భావ దర్పణము :**

అన్నమయ్య శ్రీహరితో యేమంటున్నారో వినండి. ప్రభూ! వైష్ణవులు నీవు విశ్వమంతా వ్యాపించిన విష్ణుడవని, చ్యుతి (నాశనము) లేని అచ్యుతుడవని, ఆనతియ్యగా (సెలవియ్యగా) అది నమ్మక తర్కవితర్కాలను ప్రోత్సహించే "చదువులు" యెందుకు అంటున్నారు. ప్రభూ! వెన్న తనచేతిలో వున్నవాడు 'నేయి' కోసం ఇంకొకరిని యాచించవలెనా? నీవే అంతర్యామిగా వున్నవాడు, నీవు వున్నావా లేవాయని చర్చించతగునా? దీపము చేతిలో పట్టుకొని నడిచేవాడు చీకట్లో నూతిలో పడుట అలాంటిదే కదా! అతిశయముగా నీదాస్యము మాకు వుండగా యేవేవో "కర్మలు" చేయుట యెందుకయ్యా? చేతిలో చాలా ధనమున్నవాడు సంతలో తనకు దగ్గరలో కావలసిన సరుకు కొనుక్కుంటాడు కాని, సంత అంతా తిరుగుతాడా? అలాగే నాలుకమీద నీపేరువున్న వానికి వేరే అనేక జపములెందుకయ్యా? ఏరులోని నీటితో కాలమంతా తమ అవసరాలు తీర్చుకొని "కాలువ"ను పొగడవచ్చునా? లోకపాలకుడవైన శ్రీహరివి నీవుండగా పరదేవతలను పొగడవచ్చునా, స్వామీ? దేవా! ఆకాశం చూడవలెనంటే తలెత్తి యధాలాపంగా చూడవచ్చును కదా! తోపులాట అవసరమా? అన్నిటికి నీవుండగా అన్యులను యాచించుట దేనికి? ఓ శ్రీవేంకటేశ్వరా! అందరినీ పాలించే నీవుండగా, నిన్ను కొలువక గర్విష్టులను యాచించుట దేనికి?

★**తోదోపులు**–ఒకరినొకరు తోసికొనుట ★**వట్టిచదవులేల**–పనికిమాలిన శాస్త్రాధ్యయనమెందుకు?

సంఖ్య : III/264 రాగం : రామక్రియ పుట: 178

**35 నారాయణుఁడే సర్వనాయకుఁడు**
**వేరేదురాశలు వెదకఁ జోటేదయ్యా. ॥పల్లవి॥**

**ఆకస మొకపాదము అట్టె భూమొకపాదము**
**పైకొని యొకపాదము పాతాళము**
**యేకమైనాఁ దేడనున్నా యిందులో వారే జీవులు**
**ఆకడఁ బరులఁగొల్చేమనఁజోటేదయ్యా. ॥నారా॥**

**కడుపులో జగములు కాయ మిన్నిటాధారము**
**యెడగలచోటనెల్లా యీతనిమాయే**
**కడుఁబోరా దీతఁడే కారణ మందరికి**
**తడవి మరుపాయాలఁ దగులఁజోటేదయ్యా. ॥నారా॥**

**చేతన్య మీతనిది సృష్టి యీతనిఘటన**
**ఆతుమ శ్రీవేంకటేశుఁ డంతర్యామి**
**రాతిరిఁబగలుఁ దానే రక్షకుఁడు మనలకు**
**పోతరించి ఇఁక మెచ్చి పొగడఁజోటేదయ్యా. ॥నారా॥ 264**

**భావ దర్పణము :**

అన్నమయ్య నారాయణుని విశిష్ఠతను కీర్తిస్తున్నారు. "సర్వులకు నాయకుడు శ్రీమన్నారాయణుడే. ఆయన రక్షణలో లోకములన్నీ విలసిల్లుతుండగా, దుర్మార్గులు దురాశతో చెలరేగే అవకాశమేలేదు. ఎచ్చోట వెదకినా వారు కానరారు" అని అంటున్నారు. ఒక పాదంతో భూమండలాన్ని, ఒక పాదంతో గగనమండలాన్ని ఆక్రమించి మూడవపాదంతో పాతాళలోకాలను ఆక్రమించిన త్రివిక్రముడు ఆయనే కదా! జీవులు యెక్కడవున్నా ఇందులోనివారేకదా! ఇక పరులను కొల్చెదమనుకొన్నా వారి చోటంటూ యెక్కడుంది? పదునాలుగు భువనాలూ ఈ నారాయణుని కడుపులోనే వున్నవి. కాయమే లేకపోతే ఏలోకంలో వున్నా అనుభవమెలా కలుగుతుంది? మరి ఇదంత ఈతని మాయయే కదా! ఇతని మాయ కారణముగానే అన్నీ జరిగినా దానిని దాటి ఎచ్చటికినీ పోరాదు. ఇంకొక ఉపాయము ప్రయత్నిద్దామన్నా దానికి చోటేది? జీవికి గలిగిన చైతన్యమితడిచ్చినదే. సృష్ఠి ఈతని ఘటనయే. ఆత్మరూపి అయిన శ్రీవేంకటేశ్వరుడు అందరికీ అంతర్యామి. మనందరికీ రేయింబవళ్ళు రక్షకుడుగా వుంటున్నది ఆయనే. ఇక గర్వించి ఇతనిని పొగడగ చోటెక్కడవున్నది?

★ **పోతరించి** – గర్వించి ★ **తడవి** – విచారించి





సంఖ్య : III/276 రాగం : లలిత పుట: 187

**36 వెఱవకు మనసా విష్ణునియభయము**
**నెఱవుగ నెదుటనె నిలిచినది. ॥పల్లవి॥**

**శ్రీపతికరుణే జీవరాసులకు**
**దాపును దండై తగిలినది**
**పైపై దేవునిబలుసంకల్పమే**
**చేపట్టి రక్షించఁ జెలఁగేది. ॥వెఱ॥**

**నలినోదరునిజనామాంకితమే**
**యిలపై దాసుల నేలేది**
**కలిభంజనుశంఖచక్రలాంఛన –**
**మలవడి శుభముల నందించేది ॥వెఱ॥**

**శ్రీవేంకటపతిసేసినచేఁతలే**
**వేవేలువిధుల వెలసేది**
**భూవిభుఁ డీతఁడు పూఁచినమహిమలే**
**కైవశమై మముఁ గాచేవి. ॥వెఱ॥ 276**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ కీర్తనలో తన మనస్సునకు నచ్చజెబుతున్నారు. భయపడకే మనసా! నీకు అభయమిస్తున్నది జగములకేలిక అయిన విష్ణువు. ఆ అభయముద్ర ఆయన వైకుంఠంలో ఇవ్వటం లేదు, నీ కన్నులయెదుటనే నెఱవుగ (పూర్తిగా) ఇస్తున్నాడు. ఆ శ్రీపతి కరుణయే జీవరాసులన్నిటికి అండదండై నిలిచియున్నది. ఆ జగద్రక్షకునిది బలమైన సంకల్పము. ఆర్తులను చేపట్టి రక్షించుటలో ఆయనకు సాటిలేరు. పద్మనాభుడైన ఆ శ్రీహరినామమే అంకితమైనట్లు ఆయన దాసులను పాలిస్తుంటుంది. కలిదోషమును, నివారించు శ్రీహరి శంఖ చక్రలాంఛనములను (ముద్రలను) వైష్ణవులు శరీరముపై ధరింతురు. అవి వారికి నిత్యమూ శుభములనందించు సంకేతములు. శ్రీవేంకటేశ్వరుడు చేసిన లీలలు అనేకవిధముల ప్రసిద్ధములైనవి. భూసతీ వల్లభుడైన ఆ దేవదేవుని మహిమలే మమ్ము కైవశము చేసికొని కంటికి రెప్పలా కాచుచున్నది.

★ **నలినోదరుడు** – పద్మనాభుడు ★ **దాపునుదండై** – అండదండై

సంఖ్య : III/311    రాగం : ఆహిరి    పుట: 210

**37** సేయరానిచేఁతలెల్లాఁ జేసితి నేను నీ-
గా (కా?) యగంటివాఁడ నేను గతిచూపవయ్యా. ॥పల్లవి॥

శరణాగతులఁ గూడి జ్ఞానము దొంగిలినాఁడ
అరిది నీకర్మపుటాజ్ఞలు మీరినవాఁడ
సరిఁ బ్రపంచకులముజాడ వాసినవాఁడ
ధరణి నీతప్పులకు దండన యేదయ్యా. ॥సేయ॥

బహుసంసారములెల్లఁ బంచలఁ దోసినవాఁడ
సహజపింద్రియముల జారినవాఁడ
మహి నాపుట్టుగులకే మరి బొమ్మఁబెట్టినాఁడ
విహిత మిందుకు నేది విధి చెప్పవయ్యా. ॥సేయ॥

గురుమంత్రమునకుఁ గొండెము చెప్పినవాఁడ
పరకాంతఁగూడేలోకభయము మానినవాఁడ
సిరులమించినయట్టి శ్రీవేంకటేశ నిన్ను
మరిగి శరణంటిని మన్నించవయ్యా. ॥సేయ॥ **311**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ కీర్తనలో తన నేరాన్ని అంగీకరిస్తూ ఏమంటున్నారో వినండి. దేవా! నేను సేయరాని చేతలెల్లా జేసితిని, గాయము మిగిల్చిన మచ్చవలె మిగిలినవాడను, నేను. నాకు మంచి మార్గనిర్దేశనము చేయవయ్యా! నిన్ను శరణు కోరుచున్నాను. నా నేరాలు తక్కువైనవి కావు. నేను నీ శరణాగతులనుండి జ్ఞానం దొంగిలించినాను. నీవు కర్మఫలములుగా విధించిన ఆజ్ఞలను అతిక్రమించినవాడను. ప్రపంచంలోని జీవులందరూ పరమాత్ముని కులమువారే అనే సంగతిని మరచినవాడను. న్యాయస్థానాలు ధరణిలో ఈ నేరాలకు యే శిక్షను విధించలేదు కదయ్యా! ఈ జన్మల శ్రేణులలో యెన్ని సంసారములను పంచెలలో తోసినానో లెక్కజెప్పలేను. ఇంద్రియమ్ములతో జారత్వమెన్నిసార్లు చేసినానో చెప్పలేను. భూమిపై నా జన్మలన్నీ నాకె తెలియవు కానీ తలచుకొంటే నాకే భ్రమ కలుగక మానదు. దీనికంతటికీ విహితమైన విధి యెట్టిదో చెప్పవయ్యా! గురువులు వుపదేశించిన మంత్రము సరికాదని చాడీలు జెప్పినవాడను. పరకాంతలను గూడుట పాపమను భయమును వీడిన వాడినేమో!! ఇవేవీ నాకు తెలియవు కానీ, సిరుల మించిన శ్రీవేంకటేశుడా! నీకు లొంగిన వాడనై నీకు శరణు అన్నాను. నన్ను మన్నించవయ్యా!

★ **కొండెము** – చాడీ ★ **అరిది** – దుర్లభము





సంఖ్య : III/333    రాగం : దేసాక్షి    పుట: 225

**38** ఒక్కఁ డెవ్వఁడో వుర్వికి దైవము
యెక్కువ నాతని నెరఁగవో మనసా. ॥పల్లవి॥

వొట్టినజీవుల కొకబ్రహ్మ గలఁడు
పట్టినవిప్రులు బ్రహ్మలమందురు
నట్టనడుమవారే నవబ్రహ్మలు
జట్టిగ బ్రహ్మలసంతాయ జగము. ॥ఒక్కఁ॥

కైలాసంబునఁ గలఁ డొక రుద్రుఁడు
తాలిమి నేకాదశరుద్రులు మరి
కాలరుద్రుఁడును కడపట నదివో
చాలినరుద్రులసంతాయ జగము. ॥ఒక్కఁ॥

అవతారంబున నలరినవిష్ణువు
ఆవలవిష్ణుమయ మనియెడివిష్ణువు
భువి శ్రీవేంకటమున నున్నాఁ డిదె
జవళి వరంబులసంతాయ జగము. ॥ఒక్కఁ॥

**భావ దర్పణము :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తననిలా అర్థం చేసికొంటే బాగుంటుందని నా ఉద్దేశ్యం. ఏజాతివాడైనా, ఏమతం వాడైనా, ఏ దేశం వాడైనా వానిని సృష్టించి, పోషించి, అంతమున తనదగ్గిరకే తీసికొనిపోతున్న దైవము (భగవంతుడు) ఒక్కడే. ఈ ఉర్విని, దానిపైని జీవులను, పంచభూతాలను సృజించి నిర్వహిస్తున్నది యెవ్వడో వాడే దేవుడు. ఓ మనసా! పొట్టకూటికి నేర్చిన విద్యలకు పరిమితి లేదు. వాటివల్ల నీతండ్రి అయిన దేవుని యెరుగలేవు. ఆ ప్రయత్నం చేస్తే మేలు కదా! పుట్టిన జీవులకు ఒక బ్రహ్మ అవసరం కదా! ఆపైన విప్రులంతా తామూ బ్రహ్మలమేనంటున్నారు. ఈ తిర్యక్ జీవులను నవబ్రహ్మలు సృజించారంటారు. మరి చూడబోతే జగత్తంతా బ్రహ్మల సంత మాదిరి వున్నది కదా! ఇదేమి దైవమా? జీవులను అంతంచేసే బాధ్యత రుద్రునిదట. ఆయన కైలాసంలో వుంటాడట. మరి ఏకాదశరుద్రులు కూడా సృష్టిలో వున్నారట. కాలరుద్రుని చేతిలో కాలగమనం వుంటుందట. మరి ఈ విధంగా చూస్తే జగమంతా రుద్రుల సంతవలె లేదా? విష్ణువుకి చూడబోతే పది అవతారములట. మరి జగమంతా విష్ణుమయమంటారే. ఆయన యెవ్వరు? వీరంతా యెలా వున్నా నేటి కలియుగంలో మొక్కితే ఆపదలను తీర్చి కోరిన వరములిచ్చే రక్షకుడెవరు? వేంకటాచలముననున్న కొండలరాయుడు. అందరూ వరాల కోసం యెగబడుతుంటే, జగతి ఒక వరాల సంత అయింది.

★ **తాలిమి** – క్షమగల ★ **జట్టిగ** – అమ్మకానికి సిద్ధంగా

సంఖ్య : III/275 రాగం : భైరవి పుట: 186

**39 జీవుఁడ నేనొకఁడను సృష్టికిఁ గర్తవు నీవు**
**యీవల ధర్మపుణ్యము లివివో నీచేతివి.** ॥పల్లవి॥

**పుట్టినయట్టిదోసాలు పురుషోత్తమా నీవు**
**పట్టి తెంచివేయక పాయనేరవు**
**గట్టిగా సంసారములోఁ గలిగినలంపటాలు**
**ముట్టి నీవల్ల నేకాని మోయరావు.** ॥జీవుఁ॥

**పంచభూతవికారాలు పరమాత్ముఁడా నీవే**
**కొంచక నీయాజ్ఞఁగాని కొద్ది నుండవు**
**అంచెల జగములోనిఆయాసహజములు**
**వంచుక నీవల్లఁగాని వైపుగావు** ॥జీవుఁ॥

**చిత్తములో విజ్ఞానము శ్రీవేంకటేశ నీవె**
**హత్తించి చూపినఁగాని యంకెకురాదు**
**సత్తుగా నిన్నిటికి నీశరణుచొచ్చితి మిదె**
**నిత్తెముఁ గావఁ బ్రోవ నీయిచ్చే యిఁకను.** ॥జీవుఁ॥ **275**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ కీర్తనలో తానొక జీవుడనని, కానీ అస్వతంత్రుడననియు సృష్టికర్తయైన నీవు సర్వ స్వతంత్రుడవుగాన ధర్మము పుణ్యములు నీ చేతిలోనివి అంటున్నారు. వాటిని జీవుడు ఆచరించాలంటే బుద్ధిని పుట్టించేది, దేవుడే కదా! ఓ పురుషోత్తమా! నా పుట్టుకతోనే నాకు వచ్చిన దోషములు, నీవు పట్టి తెంచకుండిన తెగి వదలనేరవు. ఈ సంసారములో మాకు చుట్టుకొనిన లంపటాలు నీవలన కానిచో వహించుట సాధ్యము కాదు. ఓ పరమాత్మ! పంచభూతములు కలిగించే వికారములను నీవే సృష్టించావు. అవి కొద్దిగానే వుండాలంటే నీ ఆజ్ఞవుండవలసిందే. అటుపైన ఈ జగత్తులో సహజంగా సంక్రమించిన బలహీనతలు, నీవు తలచుకొంటే కాని స్వాధీనము కావు. మీ మనస్సులలో వెలిగే విజ్ఞానము నీవేనయ్యా! వేంకటేశ్వరా! హత్తుకుపోవునట్లు నీవు చూపినగాని అది సాధ్యపడదు. సత్తువలె నిలిచి వీటన్నిటికి నీ శరణమే గతియని నీవు నీ ముద్ర ద్వారా చూపుచున్నావు. నేను నీ శరనుజొచ్చినాను. నిత్యమూ నన్ను రక్షించవయ్యా! ఇకపై నీ ఇచ్ఛ మా ప్రాప్తం.

★ **మోయరావు** – వహించుట సాధ్యం కాదు ★ **వైపుగావు** – స్వాధీనము కావు





సంఖ్య : III/351 రాగం : గుజ్జరి పుట: 237

**40 చెప్పఁగా నెఱఁగరా చేరి వేదవ్యాసులు**
**తప్పక చేతులెత్తి దైవ మితఁడన్నది.** ॥పల్లవి॥

**యిరవుగా నెఱఁగరా యెల్లదేవతలలో**
**పొరిఁగృష్ణుఁడు అగ్రపూజ గొన్నది**
**తిరమై తెలియరా యీదేవునిపాదపూజ**
**హరునిశిరసుమీఁద నమరివుండినది.** ॥చెప్పఁ॥

**యింకా నెఱఁగరా యితని రామమంత్రము**
**తెంకినుండి హరుఁ డుపదేశించేది**
**పొంకమిదెరఁగరా భువిమీఁద శరభము –**
**మంకుదనఁమెల్లఁ దీర మానిపివేసినది.** ॥చెప్పఁ॥

**చూచియు నెఱఁగరా సొరిది శ్రీవేంకటాద్రి –**
**నేచినవరములెల్లాఁ నియ్యఁగాను**
**కాచేదెఱఁగరా ఘనుడితఁ డెవ్వరైనా**
**చేచేత శరణంటేఁ జేకొనేబిరుదు.** ॥చెప్పఁ॥ **351**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ కీర్తనలో వేదవ్యాసుడంతటి మహానుభావుడికి శ్రీకృష్ణుడు భగవంతుడని తెలియదా? శ్రీవేంకటేశ్వరుడు శ్రీహరి కలియుగ అవతారమని తెలియదా. ఆయన చేతులెత్తి చెప్పలేరా ఇతడే దైవమని. అన్నీ విడమరచి చెప్పనక్కరలేదు. సంఘటనలను జతచేస్తే మనకే తెలుస్తుంది. అంతమంది దేవతలుండగా శ్రీకృష్ణునికే ధర్మజుడు అగ్రపూజ ఇచ్చిన నాడన్నా తెలియలేదా ఆ గోపాలుడే లోకాలపాలకుడని. బ్రహ్మ శ్రీహరిపాదములను తన కమండలంలోని జలంతో కడిగితే, అదే ఆకాశగంగయై శివుని శిరసున గంగయైనది. బ్రహ్మ, హరి, హరుల శరీరములను తాకిన గంగ అందుకే పరమ పావనియైనది. ఇది ఎరుగని వారెవరు? ఇంకా తెలియనివారున్నారా ఇది. కాశీనగరమున చనిపోయినవారి చెవిలో పరమశివుడు తారకరామ మంత్రం వినిపిస్తాడు. ఇదికూడా కొద్దిమందికి తెలిసే వుంటుంది, శరభము (మీగండ్ల మెకము) నృసింహునికి గగుర్పాటు కలిగించనెంచి, తానే బిత్తరపోయినది నృసింహుని భీకరాకృతికి. సరె! ఇవి పురాణ గాథలు అనుకొందాం. శ్రీవేంకటాద్రి మీద ఈ దేవుడిచ్చే వరములను చూచియైనా గ్రహించలేరా? నారాయణుడే అవనిలో అవతరించాడని. దేవుని నమ్మనివాడైనా ఆపదలో ఈయనకు మొక్కి శరణుప్రభూ! నన్ను రక్షించు అంటే చేకొని రక్షిస్తాడు అను బిరుదున్న ఆపదమొక్కులవాడీతడే, కదా!

★ **శరభము** – కన్నులు నెత్తిపైవున్న విచిత్ర ఆకారము ★ **ఏచిన** – అతిశయించిన

సంఖ్య : III/349 రాగం : బౌళి పుట: 235

**41 ఇంతలోనే యెచ్చరేది ఇంతలో మోసపోయేది**
**చెంత వలసినట్లఁ జేసుకొంట(?) దేహికి. ॥పల్లవి॥**

**నిమిషములోనిది నింగిఁ దిరిగాడేది**
**జమళిలోను వెలికి సరదూఁగేది**
**సమతైవుంటే నుండు చాలించిపోతేఁ బోవు.**
**భ్రమవంటిది ప్రాణము పట్టరాదు దేహికి. ॥ఇంత॥**

**నీరుబుగ్గవంటిది నిచ్చకొత్తలైనది**
**పోరచి పంచభూతాలపొరుగైనది**
**తీరితేనే తీరును తీరకుండితే నిలుచు**
**నారువంటిది మేను నమ్మరాదు దేహికి. ॥ఇంత॥**

**రేపుమాపులైనది రెండు మొకాలైనది**
**పైపై శ్రీవేంకటేశుభారమైనది**
**రూపై దగ్గరియుండు రుచులై యెదుటనుండు**
**తీపువంటిది కాలము తెగదెందు దేహికి. ॥ఇంత॥ 349**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ కీర్తనలో దేహి పడే పాట్లను వర్ణిస్తున్నారు. ఇదే పల్లవిని నేటి తెలుగులో చెప్పవలెనంటే ఇట్లా వుంటుంది. ఈ దేహివున్నాడే... వీడు ఇంతలోనే హెచ్చరికతో వుంటాడు, మరి ఇంతలోనే మోసపోతాడు. తనకు అవకాశం దొరికితే కావలసినట్లు తలపోస్తూ వుంటాడు. ఈ దేహికి మూడు ముఖ్యాంగాలు వున్నాయి. ప్రాణము, శరీరము, ఆయువు తీరే కాలము. వీటితో వీడు పడేపాట్లు చెప్పలేము. ఈ ప్రాణము దేమిని త్యజించాలంటే నిమిషములో వ్యవహారం. ఇది నింగిలో తిరుగాడగలదు. ఇది కావాలనుకొంటే దేహిలోన వుండగలదు. వద్దనుకొంటే వెలికి రాగలదు. దానికి సమ్మతి అయితే వుంటుంది, లేకపోతే చటుక్కున వదిలేస్తుంది. నిజానికి ఈ ప్రాణం భ్రమవంటిది. దేహి దీనిని పట్టుకోలేడు. ఇక మేను (శరీరం) గురించి విచారిద్దాం. ఈ మేను నీటిబుడగలాంటిది. బుడగ కొంతకాలం పెరిగి నిలకడగా వున్నట్లు కనబడినా, యెప్పుడు పగిలిపోతుందో యెవరికీ తెలీదు. నిత్యమూ ఇది కొత్తగానే వుంటుంది. విపరీతమైన పంచభూతాల మద్దతుతో తయారైనది. దీనికి కాలమెప్పుడు తీరుతుందో యెవ్వరూ చెప్పలేరు. తీరితే తీరుతుంది తీరకపోతే తీరదు. పొలంలో నారువంటిది మేను. ఫలితం చేతికందేదాకా నమ్మకం లేదు. ఇక కాలము ఎవరి చేతిలోనూ వుండదు. ఒకసారి శ్రీవేంకటేశుడు, ఎవరికెంత కాలమో నిర్ణయించాక దాన్ని మార్చటం ఎవరి తరమూకాదు. రేపోమాపో చెప్పలేం. మంచి, చెడు అనే రెండు మొఖములతో వుంటుంది. కుతూహలం కలిగించినా నీ చేతిలో వుండదు. నీకు దగ్గర వున్నట్లు అనుకూలంగా వున్నట్లు భ్రమ కల్పిస్తుంది. దాని భారం శ్రీహరిపై వేయటం ఉత్తమము.

★ **తీపు** – కుతూహలము ★ **పోరచి** – విపరీతమైన





సంఖ్య : XV/223 రాగం : వరాళి పుట: 149

**42 వైకుంఠపతి నిన్ను వడిఁ గానవలెఁ గాక**
**పైకొని తద్విష్ణోః పరమైయుండఁగను ॥పల్లవి॥**

**కాయ మేల బడలీని కడుపునించుకొఱకు**
**ఆయు రన్నం ప్రయచ్ఛతి యనఁగాను**
**ప్రాయ మేల తమకించీ పడఁతులకొఱకుఁగా**
**బాయట రుణానుబంధపశుపత్ని యనఁగా ॥వైకుంఠ॥**

**తలఁ పేల చిక్కుపడీ ధనముకొఱకుఁగాను**
**అలమి ప్రాప్తవ్య మర్థ మనఁగాను**
**వెలసి యాతుమ యేల వెఱచీ దోషములకై**
**మలసి నిర్దోషము సమంబ్రహ్మ మనఁగా ॥వైకుంఠ॥**

**ధర నిన్ని సుద్దు లేల దరి చర్చఁ గూడువెట్ట**
**నిరతి శ్రీవేంకటేశ నీ వుండఁగా**
**శరణంటి నే నిట్టే జన్మము లెల్లఁ జింతించ**
**హరి నీ నామము భవహరమై యుండఁగను ॥వైకుంఠ॥ 223**

**భావ దర్పణము :**

పెదతిరుమలయ్య చెప్పిన ఈ కీర్తనలో వైకుంఠుని గురించి పెద్దలు చెప్పిన వాక్యాలను గుర్తుచేస్తూ నిజానికి వారి ఆలోచనలు అలా అనిపించటం లేదని అంటున్నారు. వైకుంఠం వేగముగా కనుగొనుట, మానవజన్మ పరమావధి, కాని విష్ణువు లేని తావే లేదని వారే అంటున్నారు కదా! శరీరం శ్రమతో యేమిచేసినా కడుపు నింపుటకే కదా! దానివల్ల శరీరం వడలిపోతోంది కదా! మరి అన్నం ఆయువుని పెంచుతున్నదంటారే ఇదెట్లు? మనిషి పడతుల కొరకు ప్రాయాన్ని కరిగిస్తుంటే ఋణానుబంధరూపేణా పశుపత్నీ సుతాలయ అని అంటారే ఇదెట్లు? మనిషి ఆలోచనలన్నీ ధన ప్రాప్తికే చేస్తున్నాడు. మళ్ళీ ప్రాప్తముంటేనే 'అర్థం' లభిస్తుంది అంటాడు. నిర్దోషముతో వుండటం బ్రహ్మతో సమానం అంటున్నారు బాగానే వున్నది, మరి ఆత్మ దోషము అంటే యెందుకు భయపడుతున్నది? ఒకే ఒక దైవము శ్రీవేంకటేశుడుండగా, భూమ్మీద ఇన్ని దైవగాథలు ఏల చర్చించబడుతున్నాయి? నేను జన్మల గురించి చింతించనే చింతించను. ఓ శ్రీహరీ! నీశరణాగతి, నీ నామసంకీర్తనము పుట్టుకే లేకుండ చేయును కదా!

★ **పైకొని** – కలిగి ★ **మలసి** – తిరిగి

సంఖ్య : XV/218   రాగం : రామక్రియ   పుట: 146

**43 శరణు శరణు నీకు సర్వేశ్వరా నీ**
**శరణాగతే దిక్కు సామజవరదా ॥పల్లవి॥**

**వేయిశిరసులతోడి విశ్వరూపమా**
**బాయట నీ పరంజ్యోతిపరబ్రహ్మమా**
**మ్రోయుచున్న వేదముల మోహనాంగమా**
**చేయి చేత అనంతపు శ్రీమూరితీ ॥శరణు॥**

**ముగురు వేలుపులకు మూలకందమా**
**వొగి మునుల ఋషుల వోంకారమా**
**పగటు దేవతలకు ప్రాణబంధుఁడా**
**జగమెల్లాఁ గన్నులైన సాకారమా ॥శరణు॥**

**వెలయు సచ్చిదానందవినోదమా**
**అలరు పంచవింశతి యాత్మతత్వమా**
**కలిగిన దాసులకు కరుణానిధీ**
**చెలఁగి వరములిచ్చే వేంకటేశుఁడా ॥శరణు॥ 219**

**భావ దర్పణము :**

పెదతిరుమలయ్య సర్వేశ్వరుడైన శ్రీవేంకటరమణునకు శరణాగతిని వినిపిస్తున్నారు. సామజవరదా (గజేంద్ర రక్షకా) నీ శరణే దిక్కు తండ్రీ! అని వేడుకొంటున్నారు. తన తండ్రి అన్నమయ్య ఛాయలు ప్రతి చరణంలోను ప్రతిబింబిస్తున్నాయి. వేయి శిరస్సులతో విలసిల్లుతున్న ఓ విశ్వరూపా! పరంజ్యోతిగా జీవుల జీవమైన ఓ పరబ్రహ్మమా! చతుర్వేదముల రక్షణాభారము వహించిన ఓ మోహనాకారా! అనంతమైన చేతులతో జగద్రక్షణ నిర్వహించే శ్రీమూర్తీ! నీకు శరణు శరణు తండ్రి! బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు మూలకారణమైన ఆదిదేవా! మునులు, ఋషులు ఓంకారమును జపించి ఓంకార స్వరూపునిగా కనుగొన్న దేవదేవా! దేవతలందరికీ ఆపద్రక్షకుడవైన ప్రాణబంధువా! సాకారముగా కనుగొంటే జగమంతా కన్నులైన జగద్రక్షకా! నీకే శరను శరణు తండ్రీ! ఓ పరాత్సరా! నీవు సచ్చిదానందమూర్తివైన వినోద ప్రియుడవు. పంచవింశతి (ఇరువది ఐదు) ఆత్మతత్తమా! నీదాసులను కంటికి రెప్పలా కాపాడే కరుణానిధీ! సంతోషముతో వరములిచ్చే ఓ శ్రీవేంకటేశ్వరా! నీకు శరణు శరణు తండ్రీ!

★ **చెలగి** – సంతోషముతో ★ **పగటు** – ప్రకాశించు





సంఖ్య : XV/37   రాగం : రామక్రియ   పుట: 25

**44 పురుషోత్తమ నీవే బుద్ధిచ్చి కాచుట గాక**
**శిర నెత్తుకొని నవ్వ సిగ్గుగాదా నాకు ॥పల్లవి॥**

**పొసఁగ పంచేంద్రియాలు పుట్టిన దేహమే మోచి**
**యెసఁగ జితేంద్రిఁయుఁడ నెట్టయ్యే నేను**
**వసగాని కోరికల వలలోనఁ జిక్కుకొని**
**యిసుమంతలో ముక్తుఁడ నెట్టయ్యే నేను ॥పురు॥**

**తొల్లిటి కర్మముచేత దొడ్డయైన పుట్టు పుట్టి**
**యెల్లవారిలో జ్ఞాని నెట్టయ్యే నేను**
**మల్లడి సంసారము మరగువాఁడనై యుండి**
**యిల్లిదివో విరక్తుఁడ నెట్టయ్యే నేను ॥పురు॥**

**పాపపుణ్యపు లోకులపంక్తిలోన నేవుండి**
**యేపున నీ భక్తివాఁడ నెట్లయ్యే నేను**
**రాపుల శ్రీ వేంకటేశ రక్షించి కీరితిఁ బొందు**
**యీపాటి వాఁడ ధీరుఁడ నెట్టయ్యే నేను ॥పురు॥ 37**

**భావ దర్పణము :**

పెదతిరుమలయ్య పురుషోత్తమునికి ఏమి విన్నవించుకొంటున్నారో ఆలకించండి. ప్రభూ! నీవే నాకు బుద్ధినిచ్చి రక్షించావు. లేకుంటే తలయెత్తి నవ్వాలంటే కూడా సిగ్గుపడవలసిన పరిస్థితి కదటయ్యా! నాది. ఏమిజెప్పమంటావు? మాకు విపత్కరమైన పరిస్థితులు కల్పించి వాటిని అధిగమించమంటే యెట్లా ప్రభూ! మా దేహంతోపాటే పంచేంద్రియాలను పుట్టించి మాకు తగిలించావు. ఇక మేము "జితేంద్రియుల"మెట్లా అవుతామయ్యా? పనికిరాని కోరికల వలలో మమ్మల్ని చిక్కుకుపోయేట్లుచేసి తృటిలో ముక్తులవ్వాలంటే, అది జరిగే పనేనా స్వామీ? నా తొల్లిటి కర్మలవల్ల సిరిసంపదలున్న చోట పుట్టించావు. బాగానే వున్నది. కాని నేను అందరిలోను జ్ఞానినెట్లా అవుతాను స్వామీ? నన్ను పరితపించే సంసార బంధాలలో తగులుకొనేట్లు చేసి, ఇదిగో విరక్తుడవు కావేమి అంటావు. ఎట్లా కుదురుతుంది ప్రభూ? నన్ను లోకుల పంక్తిలో నిలబెట్టావు. వారి పంక్తిలో వుంటే వారు చేసే పాపపుణ్యాలు నేనూ పంచుకోవాలా వద్దా? ఇక నన్ను నీ భక్తుడనవమంటే అది జరిగే పనియేనా? రాపిడి కలిగించటంలో దిట్టవైన వో శ్రీవేంకటేశ్వరా! రక్షించటంలో సాటిలేని వాడివనే కీర్తి మూటకట్టుకొన్న నీ భృత్యుడను నేను "ధీరుడ" నెట్లా అవుతాను?

★ **మల్లడి** – పరితపించు ★ **రాపుల** – ఒరపిడి, రాపిడి

సంఖ్య : XV/171 రాగం : పాడి పుట: 114

**45 గోవిందా నే నిట్టివాఁడ గురుతు నిన్నెటిఁగీనా**
**యీ విన్నప మిది నాది యింకా నీ చిత్తము ॥పల్లవి॥**

**పొలఁతుల భావ మనేభూతము సోఁకినవాఁడు**
**తలఁకక తనమేను తా నెటిఁగీనా**
**మలసి యౌవనపు వున్మాద మెత్తినట్టివాఁడు**
**వెలయు సన్మార్గము వివేకించీనా ॥గోవిం॥**

**మించులసంపదల వుమ్మెత్తకాయఁ దిన్నవాఁడు**
**అంచల గురువు దైవమని యెంచీనా**
**పంచల కర్మమనేటి బలునావెక్కినవాఁడు**
**చంచలానఁ బొందక చక్క నడచీనా ॥గోవిం॥**

**మాయల సంసారమనే మంకు పట్టినట్టివాఁడు**
**చాయకు బుద్ధి చెప్పితే సమ్మతించీనా**
**యీయెడ శ్రీవేంకటేశ యింతట నన్నుఁ గాచితి**
**నీ యాధీనమైనవాఁడు నేరమి సేసీనా ॥గోవిం॥ 171**

**భావ దర్పణము :**

వైష్ణవులకు పరమాత్మ గోవిందుడే. తండ్రి అన్నమయ్య బాటలో విశిష్టాద్వైతం స్వీకరించిన పెదతిరుమలాచార్యులవారు చెప్పిన ఈ చక్కని కీర్తననాస్వాదించండి. ఓ గోవిందా! నేనిట్టివాడనని నీవెరుగవా? నేను నిన్ను యెటిగి చేరగలనా? అందుకే విన్నపము చేస్తున్నాను. ఆపైన నీ చిత్తము నా ప్రాప్తము స్వామీ! స్త్రీవాంఛ అనే "భూతము" పట్టినవాడను. తలకక (చలించిపోక) యెట్లుందునయ్యా? నాలాంటి వాడికి వాడి వొళ్ళు వాడికి తెలిస్తుందా? దానికి తోడు యౌవనమనే "పిచ్చి" పట్టినవాడను. ఇక సన్మార్గవివేచన యెట్లా సాధ్యమవుతుంది ప్రభూ! అపరిమితమైన సంపదలనే 'ఉమ్మెత్తకాయలు" తినినవాడను. పిచ్చి ముదిరి గురువును దైవముగా భావింతునా? వీటన్నిటికీ సరితూగునట్లు "కర్మము" అనే దృఢమైన నావను యెక్కి వున్నాను. ఆ నావ అటూ ఇటూ వూగి మునిగిపోతానేమోనని భయపెట్టక చక్కగా నడుస్తుందా దేవా? సంసారమనే మాయలో తగులుకొన్నవానికి మంకుతనం పట్టుపడటం ఒక లెక్కయా? వాడికి నీడలా వుండి మంచి బుద్ధి చెప్పినా వింటాడా? ఇంత చేసినా ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను రక్షించితివి. నీ ఆధీనములో వున్నవాడు తప్పు చేయగలడా? తండ్రీ!

★ **పంచెల** – దీనమైన ★ **చాయకు** – దారికివచ్చు





సంఖ్య : XV/43 రాగం : సాళంగనాట పుట: 29

**46 జపియించరె సర్వజనులు యీ నామము తమ**
**రపమువో పుణ్యాలకు రామనామము ॥పల్లవి॥**

**శాంతికరము రామచంద్ర నామము**
**భ్రాంతు లణఁచు రామభద్రనామము**
**వింతసుఖ మిచ్చు రఘువీర నామమూ, భూమి**
**చింత దీర్చునదివో శ్రీరామనామము ॥జపియిం॥**

**కలిదోషహరము రాఘవనామము సర్వ -**
**ఫలదము సీతాపతి నామము**
**కులక శోభనము కాకుత్థ్సనామము అని -**
**రలమైన దిదివో రామనామము ॥జపియిం॥**

**గుమిత మైనది రఘుకులనామము అతి**
**సుముఖము దశరథసుత నామము**
**అమితమై శ్రీవేంకటాద్రి నాయకుఁడై**
**రమియించె యీతని రామనామము ॥జపియిం॥ 43**

**భావ దర్పణము :**

పెదతిరుమలయ్య ఈ కీర్తనలో రామనామము ప్రాశస్త్యము వివరిస్తున్నారు. భూమిపైగల సర్వజనులు శ్రీరామనామమును జపియించరే. ఓ పుణ్యాత్ములారా! తమరియొక్క ఈ నామము రవము వోవు (చెల్లబడియగును). దానిని వదల వద్దు. రామచంద్రుని నామము శాంతిని కలిగించునది. రామభద్రుని నామము భ్రాంతులను తొలగించును. రఘువీరుని నామము వింత సుఖము నొసంగును. అదివో శ్రీరామనామము చింతలను పారద్రోలును. రాఘవుని నామము కలిదోష హరణము. సీతాపతినామము ఫలమునను‌గ్రహించునది. కాకుత్థ్స కులదీపకుని నామము కులమునకు శోభనకరము. ఇదవో ఈ రామనామము అవిరళమైనది (విడదీయలేనిది). రఘుకులజుని నామము పాపములను కుమ్మివేస్తుంది. దశరథ సుతుని నామము అందరిని అతిసుముఖులను చేస్తుంది. అమితముగా వేంకటాద్రి నాయకుడై రమించే ఈతని రామనామము సాటిలేనిది.

★ **గుమితిమైనది** – కుమ్మివేస్తుంది ★ **రమించే** – ఆనందించే

సంఖ్య : XV/138 రాగం : శ్రీరాగం పుట: 92

**47 శ్రీపతియె రక్షించుఁ గాక మరి**
**యేపున జంతువుల మే మెఱుఁగుదుము** ॥పల్లవి॥

**జలధుల లోఁతును సరి భువి వేఁగును**
**అలరించిన శ్రీహరి యెఱుఁగు**
**పొలసిన జ్ఞానము పుణ్యపాపములు**
**యిలపై జీవుల మే మెఱుఁగుదుము** ॥శ్రీపతి॥

**ఆనలము తేజము నాకసము విరివి**
**అనిశము నారాయణుఁ డెఱుఁగు**
**మునుకొన్న కాలము మొదలి జన్మములు**
**యెనయఁగఁ బ్రాణుల మే మెఱుఁగుదుము** ॥శ్రీపతి॥

**విసరే గాలియు విశ్వములోపలి**
**పస శ్రీ వేంకటపతి యెఱుఁగు**
**సుసరివై శరణము చొచ్చుట యతనికి**
**యెసఁగిన దెహుల మే మెఱుఁగుదుము** ॥శ్రీపతి॥ **138**

**భావ దర్పణము :**

పెదతిరుమలయ్య శ్రీపతి పరమాత్ముడు రక్షకుడు. మేము జంతువులము, మేము యేమెఱుగుదుము? అనే సత్యాన్ని అంగీకరిస్తున్నారు. మేము జీవులము, ప్రాణులము, దేహులము. శ్రీవేంకటేశ్వరుడు విశ్వములో "పస" ఆయనకు శరణనుటే మేము యెఱుగుదుము అని అంటున్నారు. ఈ జలధుల లోతును, ఈ భూమి చలన వేగాన్ని యెఱిగినదెవరు? ఆ శ్రీహరియే. ఆయన భగవంతుడు, సర్వజ్ఞాని. మేము జీవులము. వ్యాపించిన జ్ఞానము, పాపము, పుణ్యము వంటివి మాకు యెట్లా తెలుస్తాయి. నారాయణుడు నిత్యుడు. అగ్ని, తేజము, ఆకాశముల మూలము నెరుగగల సమర్ధుడు. మేము ప్రాణులము. ఈ కాలము యొక్క ఆవిర్భావము, మా పూర్వ జన్మ స్థితి గతులు మేము యెట్లెఱుగుదుమా? మాకంత శక్తి యెక్కడిది? వీచుచున్న ఈ గాలికి ఆవిర్భావమేది? పంచభూతములని పిలువబడే నీరు, భూమి, తేజో రూపమైన అగ్ని, ఆకాశము మరియు గాలి గురించి తెలిసినవాడు ఆ శ్రీవేంకటపతియే అని అంగీకరించితిమి కదా! దేహులమైన మేము యేమెఱుగుదుము? అందుకే ఆ స్వామికి శరణుజొచ్చితిమి.

★ **మునుకొన్న** – ముందుండిన ★ **సుసరివై** – సులభుడవై





సంఖ్య : XV/264 రాగం : కాంబోది పుట: 178

**48 కాదు వివేకము యిది కాదు యవివేకము**
**సోదించి నీకే శరణు చొరవలెఁ గాని** ॥పల్లవి॥

**కందువఁ దొల్లిటి జన్మకథ యేమి నెఱుఁగఁడు**
**ముందరిజన్మమునకు మంచి పుణ్యము సేసును**
**యిందేమి గనెనో దేహి యెవ్వరి నమ్మెనో తాను**
**సందడి భోగములలో సాములు సేసీని** ॥కాదు॥

**గరిమ భూమండలము కడవల గానఁడు**
**పరము గావలెనని పాట్లఁబడి దేహి**
**యిరవు దనకు నేదో యెఱిఁగిన యెఱుకేదో**
**పరగిన యాసలకే పట్టి పెనఁగీని** ॥కాదు॥

**తగ నిదరించేవేళ తన స్వతంత్రము లేదు**
**మిగులా నుద్యోగించు మేలుకొనేవేళ**
**నిగిడి శ్రీవేంకటేశ నీ వంతరాత్మ వనక**
**వెగటుఁ జదువులలో వెదకఁ జూచీని** ॥కాదు॥ **264**

**భావ దర్పణము :**

పెదతిరుమలయ్య తాను చేసేపని వివేకవంతమైనదా లేక అవివేకవంతమైనదా అని వెఱగు పడుతున్నారు. ఏదియేమైనా శోధించి నీకే శరణన్నాను స్వామీ! అంటున్నారు. మానవుడికి తెలిసినదానికంటే తెలియందే అధిక భాగము. తొల్లిటి జన్మలు, రాబోవు జన్మలు తెలియవు. ఈ జన్మలో కూడా మూడొంతులు నిద్రేకదా!. జాడనెఱిగితే జీవి తన తొల్లిటి జన్మలో జరిగిన కథనేమాత్రము యెఱుగడు. కాని వచ్చే జన్మలో మంచి జరగాలని ఇప్పుడే పుణ్యకార్యాలు చేస్తాడు. మరి ఈ జన్మలో యేమి చూచినాడో ఈ దేహి తాను ఏమి నమ్ముతున్నాడో చెప్పలేము. తనకు సందడి కలిగించే భోగములలో ఆ జీవి సాములు చేస్తూనే వున్నాడు. ఈ జీవి ఇహములోగల భూమండలంలో తానున్న తావునే పూర్తిగా యెఱుగడు. ఇక పరమునేమి యెఱుగును? కాని పరమును సాధించాలని తగని పాట్లు పడుతుంటాడు. తన స్థానమేదో తాను తెలియలేదుగాని అంతులేని ఆశలతో అన్నీ తనకే కావాలనుకొంటాడు. సరే! వీడి ప్రస్తుత పరిస్థితి చూద్దాము. నిదురించేవేళ తన స్థితి తనకే తెలియని అస్వతంత్రుడు ఈ జీవి. మిగిలిన మెలకువ వేళల్లో మాత్రం తన ఉద్యోగములు తాను ఆచరిస్తుంటాడు. ఓ శ్రీ వేంకటేశ్వరా! నీవే మా అంతరాత్మవై మా చెంతవుంటే, పనికిరాని చదువులలో నిన్ను వెదకజూచుచున్నాము.

★ **నిగిడి** – వ్యాపించి ★ **కడవల** – చివరకు

సంఖ్య : XV/271   రాగం : రామక్రియ   పుట: 183

**49** కోరి నీ యీవికి దొడ్డఁ గొంచెము లేదు
ధారుణిలో నీ సరి దాతలు వేరీ ॥పల్లవి॥

వుత్తానపాదుని కొడుకొగి నుతియించు టెంత
బత్తితో నీ విచ్చు ధ్రువపట్ట మెంతా
మత్తి పిలువవచ్చిన యక్రూరుపని యెంత
సత్తుగా నీ రూపు చూపి చన విచ్చు టెంతా ॥కోరి॥

వొట్టి యంబరీషుఁడున్న వుపవాస మది యెంత
అట్టె చక్రము రక్షగా నంపు టెంతా
గుట్టునఁ గాముకులైన గోపికలు గూడు టెంత
నెట్టన నిహపరాలు నీ విచ్చు టెంతా ॥కోరి॥

తలఁచి గుహుఁడు వోడ దాఁటించినమాత్ర మెంత
సులభాన నిండుఁ గృపఁజూచుట యెంతా
బలిమి శ్రీవేంకటేశ పరుషలకా నీ కెంత
వలసినట్టు నీ విచ్చు వరము లివి యెంతా ॥కోరి॥ **271**

**భావ దర్పణము :**

పెదతిరుమలయ్య ఈ కీర్తనలో శ్రీహరి దాతృత్వమునకు పరిమితులు లేవని చెబుతున్నారు. నీ దాతృత్వానికి దొడ్డది కొంచెముది అనే పరిమితే లేదు. ఈ భూమ్మీద నీ సరిదాతలు లేనేలేరు. నిన్ను కోరినవాడిది లోపముగాని నీది కాదు అంటున్నారు. ఉత్తానపాదుడికొడుకైన ధ్రువుడి వయసెంతని వానికి అంత పెద్ద వరమిచ్చావు? అతడు భక్తితో నిన్ను యెంతనుతించాడని ధ్రువమండలానికి నింగిలో అధిపతిని చేశావు? నిన్ను కంసుని వద్దకు పిలువనంపబడినవాడు అక్రూరుడు. ఆయన యేమి గొప్ప పని చేశాడని నీ విష్ణురూపము చూపి నీ సత్తా చాటినావు? అక్రూరవరద అనే నామము ధరించావు కదా! స్వామీ! అంబరీషుడు చేసిన ఉపవాసదీక్ష యేపాటిది? దుర్వాసుని నుంచి అతనిని రక్షించటానికినీఈ చక్రాయుధాన్ని పంపినావు. కాముకురాంద్రయిన గోపికలు చేసిన గొప్పపని యేమిటని వారికి ఇహమున నీ పొందు పరమున ముక్తియొసగినావు. ఇదంతా అటుంచి త్రేతాయుగంలో నీవు శ్రీరాముడవై యెంత గొప్ప ఈవి ప్రదర్శించావు? గుహుడు చేసిన ఘనకార్యమేమిటి? కాళ్ళు కడగనివ్వకపోతే పడవలో కూర్చోబెట్టుకోనంటే నా పాదప్రక్షాళనా భాగ్యమిచ్చావు. ఎంత కృప చూపించావు? ఓ శ్రీవేంకటేశ్వరా! పరుషలకు (తిరుమల యాత్రకు వచ్చేవారికి) బలిమి యేపాటిదని కోరిన వరాలు కుప్పలు తెప్పలుగా ఇస్తున్నావు? నీ దాతృత్వమే అంత, తండ్రీ!

★ **గుట్టున** – రహస్యముగా ★ **ఈవి** – దాతృత్వము





సంఖ్య : XV/279   రాగం : భైరవి   పుట: 188

**50** పరిపూర్ణుఁడవు నీకుఁ బరాకున్నదా నిన్ను
మరిగి వుండనిదే మావల్లఁ దప్పు గాకా ॥పల్లవి॥

వినవా నీ వేమియైనా విశ్వమెల్లా వీనులే
యెనసి విన్నవించని యెడ్డతన మింతే కాక
కనవా నీ విన్నియు నీ కన్నులే యెందు చూచినా
పనితో నాభావము చూపని నేరమి గాకా ॥పని॥

పలుకవా నీ వేమియైనా బహుశబ్దమయుఁడవు
అలరి పిలువని నా యవివేక మింతే కాక
నిలువవా నా ముందర నిఖిలస్వరూపుఁడవు
తెలిసి చూడలేని సందేహ మింతేకాక ॥పని॥

మన్నించవా నీ వేమి మఱఁగు చొచ్చితి నంటే
పన్ని మత్తుఁడనై యున్న నా కర్మము గాక
యిన్నిట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
యిన్నాళ్ళెఱఁగని భాగ్యమిట్టుండెఁ గాకా ॥పని॥ **279**

**భావ దర్పణము :**

“పరాకు” అంటే ఆశ కలిగియుండుట అని అర్థము. పెద తిరుమలయ్య వినిపించిన ఈ కీర్తనలో స్వామితో యేమంటున్నారో వినండి. నీవు పరిపూర్ణుడవు ప్రభూ! నీకు ఆశ కలిగించేది యేదైనా వుంటుందా? నీకు బాగా మాలిమియైవుండని మావల్ల అపరాధము జరిగిందికాని, నీవలన యేతప్పు లేదయ్యా! అంటున్నారు భక్తి పారవశత్వంతో. నీవేమియైనా వినకుండా యెట్లావుంటావు ఈ విశ్వమంతా నీవీనులేకదా! నీకు బాగా వినిపించలేకపోవుట మా మూర్ఖత్వము, అంతే. మేము చేసే మంచి చెడ్డలు నీవు కానక వుంటావా? యెందు చూచినా నీకన్నులే కదా! నా భావము నీకెఱిగించలేని నాదేనయ్యా! తప్పంతా. నీవేమీ పలుకవు అనుకోవటం తెలివితక్కువ. అనేక శబ్దములును నీమాటలే. నీతో పలుకక పోవటం నా అవివేకము తండ్రీ! నాముందు అనేక రూపాల్లో సంచరిస్తూవుంటావు. అనేక సందేహాలతో యెవ్వరినీ నమ్మని నాదే నేరమంతా. దేవా! నీ శరణాగతి కోరి నీ మరుగుజొచ్చితిని అంటే నన్ను మన్నించవా? మత్తుడనైవున్న నా కర్మము కొలది నీ అందచేరకున్నాను. అయినా నన్ను ఇట్టే యేలితివయ్యా! శ్రీవేంకటేశ్వరా! నిన్ను ఇన్నాళ్ళూ యెఱుగని నా భాగ్యము ఇట్లున్నదయ్యా! నీ తప్పేముంది ప్రభూ!

★ **పరిపూర్ణుడు** – అన్నిటిలోనూ ఆరితేరినవాడు ★ **నేరమి** – తప్పు

సంఖ్య : XV/265  రాగం : మధ్యమావతి  పుట: 179

**51** ఇప్పుడు నమ్మినవారి కింతకంటె సులభుఁడు
తప్పక తలఁచుకోరో దైవజ్ఞులాలా ॥పల్లవి॥

సీతావిరహ మోర్చి శ్రీరామచంద్రుఁడు
భ్రాతయైన లక్ష్మణునిఁ బాయలేఁ డాయ
ఆతుమ బంధువులకంటె నండఁ బాయక కొలిచె
నీతికైంకర్యపరుఁడే నిజబంధుఁ డాయెను ॥ఇప్పుడు॥

వడి దశరథుఁ బాసి వచ్చిన రాఘవునికి
కడు సుగ్రీవుచుట్టరికము గలిగె
తడయక కనిపించె తల్లిదండ్రులకంటె -
నడరిన సేవకుఁడె యంతరంగుఁ డాయెను ॥ఇప్పుడు॥

మచ్చికతో భరతునిమాట మీఱినరాముఁడు
మెచ్చి విభీషనుభక్తి మీఱలేఁ డాయె
అచ్చపు శ్రీవేంకటేశు అన్నఁదమ్ములకంటెను
తచ్చి శరణాగతుఁడె తగ నిష్టుఁ డాయెను ॥ఇప్పుడు॥ **265**

**భావ దర్పణము :**

పెదతిరుమలయ్య ఈ కీర్తనలో శ్రీహరి భక్తసులభుడని, సోదాహరణంగా రామాయణ పరంగా వివరిస్తున్నారు. మేము దైవజ్ఞులమని, శాస్త్రాలను కాచి వడపోశామని విఱ్ఱవీగే మహామహులారా! మీరు తప్పకుండా ఒకసారి ఇది తలచుకోండి. ఇప్పుడు (ఈ త్రేతాయుగంలో) నమ్మినవారికి ఇంతకంటే సులభుడు కనబడుట సాధ్యమా? ఈయన సీతాపతి. సీత తన బహిఃప్రాణము. కాని ఈ శ్రీరామచంద్రుడు సీతాపహరణతో విరహవేదనతో కృంగిపోయినా సహించాడు కాని యుద్ధంలో లక్ష్మణుడు మూర్ఛిల్లితే కన్నీటితో రోదించాడు. ఆత్మబంధువుకంటే, తనకు నీడలా వుండే నీతిమంతుడైన కైంకర్యపరుడే నిజబంధువని నిరూపించాడు శ్రీరాముడు. రాఘవుడు తండ్రి మాటకోసం, వెంటనే దశరథుని విడచి అడవులకు వెళ్ళాడు. అనంతరం కిష్కింధలో సుగ్రీవునితో మైత్రి కలిగింది. ఏమాత్రమూ ఆలసించక కనిపెంచిన తల్లిదండ్రులకంటే అడరిన (పూనికట్టుబడిన) సేవకుడే తనకు నిజమైన ఆంతరంగికుడని శ్రీరాముడు నిరూపించినాడు. భరతుడు శ్రీరాముని ఆరోప్రాణమని అందరికీ తెలిసినదే. రాముని పాదుకలకే పట్టాభిషేకం చేయించిన త్యాగి భరతుడు. కాని రాముడు విభీషణుని మెచ్చి లంకారాజ్యాన్ని వాగ్దత్తమొనర్చి ఆతని భక్తికి లొంగిపోయాడు. నేటి కలియుగంలో, స్వచ్ఛమైన శ్రీవేంకటేశ్వరుడు అన్నదమ్ముల కంటే శరణాగతులే తనకు యెక్కువని, తనకు ఇష్టులని జగములలో చాటినాడు.

★ **దైవజ్ఞుడు** – జోస్యుడు ★ **అచ్చపు** – స్వచ్ఛమైన





రచయిత:

## అమరవాది సుబ్రహ్మాణ్య దీక్షితులు



| | | |
|---|---|---|
| పిలవండి | : | **అమరవాది సుబ్రహ్మాణ్య దీక్షితులు** |
| పుట్టింది | : | **9-6-1945** |
| చదివింది | : | **ఎం.టెక్.** |
| ఉండేది | : | **ఫ్లాట్ నెం. 5., ప్లాటు నెం. 61, సిద్దార్థ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్.** |
| రంధి | : | **భగవన్నామ సంకీర్తన** |
| నచ్చింది | : | **శాస్త్రీయ సంగీతం** |
| నచ్చంది | : | **నక్కజిత్తులు** |
| మెచ్చింది | : | **సజ్జన సాంగత్యం** |
| రింగండి | : | 00919393021360 |
| చదవండి | : | www.geetadeksha.com |
| ఇవ్వండి | : | e-mail : geetadeksha@gmail.com |